

రెవెన్యూ అధికారులకు షోకాజ్

- ఈ నెల 22న జేసీ ఎదుట హాజరుకావాలని కలెక్టర్ ఆదేశం
- రెవెన్యూ రికార్డుల ట్యాంపర్ వ్యవహారంలో కదలిక

- మెయిన్‌లో

కుక్కల దాడిలో జింకకు గాయాలు

ఎండాడలోని ఓ అపార్ట్‌మెంట్ సమీపంలో ఘటన



- 7వ పేజీలో

నగరంలో ఐపీఎల్ సందడి

- మార్చి 24న తలపడనున్న ఢిల్లీ క్యాపిటల్స్-లక్నో సూపర్ జెయింట్స్
- మార్చి 30న ఆడనున్న ఢిల్లీ క్యాపిటల్స్-సన్‌రైజర్స్ హైదరాబాద్
- విడుదలైన షెడ్యూల్



విశాఖపట్నం, స్పోర్ట్సు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి):

టాటా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో రెండు మ్యాచ్‌లకు విశాఖ ఆతిథ్యమివ్వనుంది. ఐపీఎల్ సీజన్-18 షెడ్యూల్‌ను ఆదివారం సాయంత్రం విడుదల చేసిన సందర్భంగా విశాఖకు రెండు మ్యాచ్‌లు కేటాయించారు. పీఎం పాలెంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా మార్చి 24న ఢిల్లీ క్యాపిటల్స్-లక్నో సూపర్ జెయింట్స్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. అదేవిధంగా మార్చి 30న ఢిల్లీ క్యాపిటల్స్-సన్‌రైజర్ హైదరాబాద్ జట్టు ఇదే గ్రౌండ్‌లో తలపడనున్నాయి.

గత ఏడాది పీఎంపాలెంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియంను హోం గ్రౌండ్‌గా ఎంచుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఇక్కడ రెండు మ్యాచ్‌లు ఆడింది. ఈ ఏడాది కూడా ఇదే స్టేడియాన్ని హోం గ్రౌండ్‌గా చేసుకోవడంతో రెండు మ్యాచ్‌లు ఆడేందుకు అవకాశం లభించింది. గత ఏడాది ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు తొలి మ్యాచ్ చెన్నై సూపర్ కింగ్స్‌తో, రెండో మ్యాచ్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో ఆడింది. ఇదిలా ఉండగా ఈ ఏడాది కూడా ఐపీఎల్ మ్యాచ్‌లను విశాఖకు కేటాయించే అవకాశముందని భావించి ఏసీఏ ప్రతినిధులు నిర్వహణకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నామనే సంకేతాలను పంపించారు. తాజాగా రెండు మ్యాచ్‌లను కేటాయించడంతో పక్కాగా ఏర్పాట్లు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆంధ్ర క్రికెట్ సంఘానికి ఇటీవల కొత్త ... మిగతా 6వ పేజీలో



క్యాన్సర్ రహిత సమాజమే ధ్యేయం

బీచ్ రోడ్డులో ఉత్సాహంగా పింక్ సఖీ శారీ వాక్

క్యాన్సర్ రహిత సమాజమే ధ్యేయం కావాలని సినీ నటి గౌతమి పిలుపునిచ్చారు. రౌండ్ టేబుల్ లేడీస్ సర్కిల్ ఆఫ్ ఇండియా, రోహిత్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం బీచ్‌రోడ్డులో నిర్వహించిన పింక్ సఖీ శారీ వాక్‌లో మేయర్ గొలగాని హరివెంకట కుమారితో కలిసి ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో పింక్ కలర్ దుస్తులతో పాల్గొన్న మహిళలు కేన్సర్‌పై అవగాహన పెరిగేలా ప్లకార్డులు ప్రదర్శించారు. -7లో

బెట్టింగ్, లోన్ యాప్‌లపై సీపీ దృష్టి

డౌన్‌లోడ్ చేస్తున్న వారిపై ప్రత్యేక నిఘా



- ఐపీ ఆధారంగా గుర్తించాలని నిర్ణయం
- సాధ్యాసాధ్యాలపై సాంకేతిక నిపుణులతో చర్చ
- ఐపీఎల్ నేపథ్యంలో బెట్టింగ్‌కు ముకుతాడు వేయాలని పోలీస్ కమిషనర్ యోచన

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

ఎంతోమంది జీవితాలను అతలాకుతలం చేస్తున్న బెట్టింగ్, లోన్‌యాప్‌లకు నగరంలో అడ్డుకట్టవేయాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి భావిస్తున్నారు. ఆయా యాప్‌లను డౌన్‌లోడ్‌చేసే వారిని గుర్తించగలిగితే పూర్తిస్థాయిలో అరికట్టగలమని యోచిస్తున్నారు. ఈ నేపథ్యంలో నగర పరిధిలో గూగుల్ ప్లేస్టోర్ నుంచి అలాంటి యాప్‌లను డౌన్‌లోడ్‌చేసే వారిని గుర్తించేందుకు గల సాధ్యాసాధ్యాలపై సాంకేతిక నిపుణులతో ప్రాథమికంగా చర్చించాలని నిర్ణయించారు.



నగరంలో బెట్టింగ్ ముఠాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. నిత్యం ఏదో ఒక మ్యాచ్‌పై ఆన్‌లైన్‌లో బెట్టింగ్ జరుగుతోంది. ఇది లాభసాటిగా మారడంతో చాలామంది బుకీల అవతారం ఎత్తి మొబైల్‌యాప్‌ల ద్వారా కార్యకలాపాలు సాగిస్తున్నారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో చాలా మంది బెట్టింగ్‌కు బానిసలుగా మారుతున్నారు. ఒకసారి పోగొట్టుకున్న డబ్బును తిరిగి ఎలాగైనా గెలుచుకోవాలనే కసితో అప్పులుచేసి మరీ బెట్టింగ్ కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో చేసిన అప్పులు తీర్చే దారిలేక అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. మరికొందరైతే కుటుంబసభ్యుల ఆభరణాలు, ఆస్తుల ను విక్రయించి కుటుంబాన్ని రోడ్డున పడేస్తున్నారు.

గత నెలలో బయటపడిన ముఠా

గతనెల 17న పెదవాల్తేరు లోని ఒక అపార్ట్‌మెంట్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న బుకీని టాస్క్‌ఫోర్స్ సైబర్‌క్రైమ్ పోలీసులు కలిసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు అతని వద్ద లభించిన ఆధారా లను బట్టి శివాజీపాలెం, పెదవాల్తేరు, ఇసుకతోటకు చెందిన కొంతమంది బుకీలుగా మారి బెట్టింగ్ నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. వివిధ బ్యాంకు ఖాతాల ద్వారా సుమారు రూ.400 కోట్లు విలువైన బెట్టింగ్ లావాదేవీలు జరిగినట్టు తేల్చారు. ఈ కేసులో ఇంతవరకు 12 మందిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. మరికొందరి కోసం గాలిస్తున్నారు. ఈ ఉదంతం నగరంలో బెట్టింగ్ ఏస్థాయిలో జరుగుతుందనే దాన్ని బయటపెట్టింది.

క్రికెట్ టోర్నీల నేపథ్యంలో...

ఇలాంటి బెట్టింగ్ ... మిగతా 6వ పేజీలో

అసంపూర్తిగా హుద్‌హుద్ ఇళ్లు

టెండర్లు పిలిచినా స్పందించని కాంట్రాక్టర్లు

కొమ్మాది, పరదేశిపాలెంలో లబ్ధిదారుల ఆందోళన

- తాజాగా మళ్లీ టెండర్లు ఆహ్వానించిన అధికారులు



కొమ్మాదిలో అసంపూర్తిగా ఉన్న హుద్‌హుద్ ఇళ్లు

విశాఖపట్నం/కొమ్మాది, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి):

హుద్‌హుద్ తుఫాన్ బాధితుల కోసం కొమ్మాది, పరదేశిపాలెంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాలేదు. అసంపూర్తి పనులు పూర్తి చేయడానికి గత రెండు, మూడేళ్లగా టెండర్లు పిలుస్తున్నా ఒక్క కాంట్రాక్టర్ కూడా ముందుకు రావడంలేదు. తాజాగా రూ.2.25 కోట్లతో మరోసారి టెండర్లు పిలిచారు.

హుద్‌హుద్ బాధితుల కోసం చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నగరంతోపాటు శివారు ప్రాంతాల్లో రమారమి ఐదు వేల ఇళ్ల నిర్మాణం చేపట్టారు. కొమ్మాదిలోని సర్వే నంబరు 83లో 608 ఇళ్లు, పరదేశిపాలెంలోని సర్వే నంబరు 21లో 196 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. కొమ్మాదిలో లేఅవుట్‌కు ఆనుకుని భారీగా వరద కట్ట నిర్మించారు. ఇళ్ల నిర్మాణాలకి స్లాబ్‌లు వేసి కొన్ని బ్లాకులు పూర్తిచేయగా మరికొన్ని వదిలేశారు. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ నుంచి అప్పటి అధికారులు భారీగా సొమ్ములు తీసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. అయినప్పటికీ పనులు నత్తనడకన చేయడంతో ఆయన్ను తొలగించి మరో కాంట్రాక్టర్‌ను తీసుకొచ్చారు. ఆయన కొంతమేర పనులు చేశారు. సొమ్ములు కోసం నిరంతరం వేధిస్తుండడంతో విసుగుచెంది మధ్యలో విడిచిపెట్టి ... మిగతా 6వ పేజీలో

చికెన్ విక్రయాలు ఢమాల్

- మటన్‌కు పెరిగిన డిమాండ్
- బర్డ్‌ఫ్లూ ప్రచారమే కారణం



సీతంపేట వద్ద ఖాళీగా ఉన్న చికెన్ సెంటర్. పక్కన మటన్ దుకాణం వద్ద క్యూ

విశాఖపట్నం/గోపాలపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి):

బర్డ్‌ఫ్లూ వైరస్ వ్యాప్తి నేపథ్యంలో నగరంలో చికెన్ విక్రయాలు పూర్తిగా పడిపోయాయి. అదే సమయంలో మటన్‌కు డిమాండ్ అమాంతంగా పెరిగిపోయింది. నగరంలో ప్రతిఆదివారం రెండు లక్షల కిలోల చికెన్ విక్రయం జరిగేది. గతకొద్దిరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా బర్డ్‌ఫ్లూ వైరస్ వ్యాప్తి పెరిగింది. దీనివల్ల కోళ్లకి వైరస్ సోకి మృత్యువాతపడుతున్నాయి. బర్డ్‌ఫ్లూ వ్యాప్తి నేపథ్యంలో వైరస్ కలిగిన కోడి మాంసాన్ని తింటే మనుషులకు కూడా వైరస్ సోకుతుందనే ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామం ప్రజల్లో ఆందోళనకు దారితీస్తోంది. ఈ నేపథ్యంలో ప్రజలు ముందు జాగ్రత్తగా చికెన్‌కు దూరంగా ఉండడమే మంచిదనే భావనతో ఉన్నారు.

నగరంలో ఆదివారం చికెన్ కొనుగోలుచేసేవారంతా ఆ దుకాణాలవైపు వెళ్లకపోవడంతో వెలవెలబోయాయి. అదే సమయంలో చికెన్ తినేవారంతా మటన్ కొనుగోలుకి ఆసక్తిచూపడంతో మటన్ దుకాణాలకు జనాలు పోటెత్తారు. సాధారణంగా ఆదివారం వచ్చే వారి కంటే అధికంగా కొనుగోలుదారులు వస్తుండడంతో మటన్ అయిపోతుందనే ఆందోళన కొనుగోలుదారుల్లో ఏర్పడింది. దీంతో పోటీపడడంతో మటన్ దుకాణాల వద్ద భారీ క్యూలు కనిపించాయి. గతంలో ఆదివారం వస్తే కొనుగోలుదారులతో రద్దీగా కనిపించే చికెన్‌దుకాణాల వద్ద కొనే వారే కనిపించకపోగా... ఆర్థికంగా కొంతస్థోమత కలిగినవారు, ఏదైనా ప్రత్యేక కార్యక్రమం కలిగినవారు మాత్రమే కనిపించే మటన్ దుకానాల వద్ద గతంతో పోల్చితే మూడు, నాలుగురెట్లు రద్దీ కనిపించింది. మరికొద్దిరోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని చికెన్‌వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు.

కోడ్ ముగిశాకే..!

మల్టీ లెవెల్ కారు పార్కింగ్, హెలికాప్టర్ మ్యూజియం ప్రారంభోత్సవం వాయిదా

విశాఖపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి):

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ఈ నెలలో రెండు ప్రాజెక్టులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ప్రారంభించాలని భావించగా, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో ఆ కార్యక్రమం వాయిదా పడింది. ఈ రెండు ప్రాజెక్టుల విలువ రూ.90 కోట్లు.



ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనం

వీఎంఆర్‌డీఏ సిరిపురం జంక్షన్‌లో మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనం నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. దూరం నుంచి చూస్తే క్రూయిజ్ షిప్ మోడల్‌లో కనిపించే ఈ భవన నిర్మాణానికి రూ.87.5 కోట్లు ఖర్చు చేశారు. ఇది 11 అంతస్థుల భవనం. బేస్‌మెంట్‌లో మూడు అంతస్థులు, పైన మొదటి, రెండో అంతస్థులు (మొత్తం ఐదు) పార్కింగ్‌కు కేటాయించారు. 430 కార్లు, 400 దిచక్ర వాహనాలు పార్క్ చేసుకోవచ్చు. మూడో అంతస్థు నుంచి ఏడో అంతస్థు వరకు (ఐదు అంతస్థులు) ఐటీ సంస్థకు కేటాయిస్తారు. ఈ భవన నిర్మాణం దాదాపు పూర్తికావచ్చింది. ఇంటీరియర్, ఎక్స్‌టీరియర్‌కు తుది మెరుగులు దిద్దుతున్నారు.

రామకృష్ణా బీచ్ రోడ్డులో ఏయూ కన్వెన్షన్ సెంటర్ పక్కనే యూహెచ్ 3 హెచ్ హెలికాప్టర్ మ్యూజియం నిర్మాణం కూడా చివరి దశకు వచ్చింది. నేవీలో సుమారు పదిహేడేళ్ల సేవలందించి గత ఏడాది జూన్ 28న ఐఎన్ఎస్ డేగాలో డీ కమిషనింగ్ జరిగిన 'యూహెచ్-3హెచ్' హెలికాప్టర్‌ను ఇక్కడి మ్యూజియంగా పెడుతున్నారు. దీనికి రూ.2 కోట్లు వెచ్చిస్తున్నారు. కాగా ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత ముఖ్యమంత్రి కార్యాలయం ఇచ్చే తేదీని బట్టి ప్రారంభోత్సవం చేయించాలని వీఎంఆర్‌డీఏ వర్గాలు భావిస్తున్నాయి.

ఏయూ దూర విద్యలో లేటరల్ ఎంట్రీ దుమారం

విశాఖపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలోని దూర విద్యా కేంద్రంలో లేటరల్ ఎంట్రీపై దుమారం రేగుతోంది. ఈ విధానంలో చేపట్టే ప్రవేశాలతో ప్రైవేటు కాలేజీలు ఇష్టారా జ్యంగా వ్యవహరించడంతోపాటు సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే గతంలో ఈ విధానాన్ని రద్దుచేశారంటున్నారు. తాజాగా లేటరల్ ఎంట్రీ విధానంలో ప్రవేశాలకు దూరవిద్యా కేంద్రం అధికారులు అనుమతి ఇవ్వడం చర్చనీయాంశమయింది. లేట రల్ ఎంట్రీ ప్రారంభించాలని భావిస్తే ముందుగా నోటిఫికే షన్ ఇవ్వాలి. కానీ అదేదీ లేకుండా ప్రక్రియ ప్రారంభించడం వెనుక కొందరు అధికారుల అధికారుల అత్యుత్సాహం, ప్రైవేటు కాలేజీల నుంచి లబ్ధి కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి.

- నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశాలపై విమర్శలు
- నోటిఫికేషన్ ఇవ్వకుండానే ప్రక్రియ ప్రారంభం
- కొన్ని కాలేజీల నుంచి లబ్ధి చేకూరడమే కారణం
- విద్యార్థులకు మేలు చేసేందుకే: దూర విద్య డైరెక్టర్

అనివార్య కారణాల వల్ల డిగ్రీ పూర్తిచేయని విద్యార్థులకు లేటరల్ ఎంట్రీ విధానంలో కోర్సు పూర్తిచేసే అవకాశం కల్పిస్తారు. డిగ్రీ ప్రథమ సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులు ద్వితీయ, తృతీయ సంవత్సరం పరీక్షలు రాయకపోడం, కొన్ని సబ్జెక్టులు ఫెయిల్ కావడంతో సర్టిఫికెట్ పొందలేని పరిస్థితి. వారికి ఈ విధానంలో ప్రవే శాలు కల్పించడం ద్వారా మిగిలిన సబ్జెక్టులు పూర్తిచేసే వీలు కల్పిస్తున్నారు. అయితే ఇందులో కొన్ని ప్రైవేటు కాలే



జీలు పూర్తిగా విద్యార్థులకు స్వేచ్ఛనిస్తాయని, కాపీయింగ్ ను ప్రోత్సహించి, వసూళ్లకు పాల్పడతాయని చెబుతు న్నారు. ఈ నేపథ్యంలోనే కొన్ని కాలేజీలు ఒత్తిడి చేసి మరీ లేటరల్ ఎంట్రీ విధానాన్ని తీసుకువచ్చేలా అధికారులను ప్రసన్నం చేసుకున్నట్టు చెబుతున్నారు.

స్పెషల్‌డ్రైవ్ ఉన్నా...

అనివార్య కారణాలతో డిగ్రీ పూర్తిచేయలేని విద్యార్థుల కోసం ఇప్పటికే ఏయూ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహి స్తున్నారు. తగిన ఫీజు చెల్లించి డిగ్రీ పూర్తిచేసే అవకాశం కల్పిస్తున్నారు. అయినప్పటికీ దూర విద్య అధికారులు లేటరల్ ఎంట్రీకి అవకాశం కల్పించడం అనేక అనుమానా లకు తావిస్తోందంటున్నారు. అంతేకాదు లేటరల్ ఎంట్రీలో అడ్మిషన్ పొందే విద్యార్థులు డిస్టెన్స్‌లో కోర్సు పూర్తిచేసి నట్టు సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుంది. అదే స్పెషల్‌డ్రైవ్‌లో అయితే రెగ్యులర్ సర్టిఫికెట్ వస్తుంది. అయినా ఈ విధానానికే మొగ్గు చూపడం వెనుక కారణాలేమిటనేది అధికారులు బయటపెట్టడం లేదంటున్నారు.

నోటిఫికేషన్ ఇవ్వకుండానే..

సాధారణంగా దూరవిద్య ... మిగతా 6వ పేజీలో

ఉత్సాహంగా బల్లల పండుగ

భీమునిపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): భీమిలి జోన్ 4వ వార్డు కాపులుప్పాడ సోమన్నపాలెంలో కంచి కామాక్షమ్మ రజక సేవా సంఘం ఆధ్వర్యంలో రజకులు బల్లల పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఆదివారం ఉదయం ఈ ఉత్సవాలను టీడీపీ వార్డు అధ్యక్షుడు పాసి నర్సింగరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. వేడుకలో మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వేడుకల్లో ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నరవ అప్పలరాజు, ఎస్.అప్పలరాము, రజక ఫెడరేషన్ ఛైర్మన్ రాజమండ్రి నారాయణ, ఉపాధ్యక్షులు కె.తాతారావు, కోశాధికారి పి.నాగరాజు, కాపులుప్పాడ మాజీ సర్పంచ్ నారు ఎల్లాజీ, ఎం.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హోమియో వైద్య శిబిరం



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, పాల్గొన్న సంస్థ ప్రతినిధులు

భీమునిపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : భీమిలి కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. చిన్న బజార్ డచ్‌రోడ్డులో ఉన్న ఆ సంస్థ కార్యాలయం ఆవరణలో ఈ శిబిరాన్ని ఫౌండేషన్ ఛైర్మన్ శ్రీరామ్‌చంద్రమూర్తి ప్రారంభించారు. ఉదయం తొమ్మిదిన్నర నుంచి మధ్యాహ్నం ఒంటిగంటన్నర వరకూ జరిగిన ఈ శిబిరంలో అనుభవజ్ఞులైన హోమియో వైద్యులు పరీక్షలు చేసి అవసరమైన మందులు ఉచితంగా రోగులకు అందించారు. ఈ శిబిరంలో 80 మంది వైద్య పరీక్షలు చేసుకుని మందులు ఉచితంగా పొందారు. ఆ సంస్థ ప్రతినిధులు కేఎస్ఎన్ మూర్తి, భానోజీరావు, శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తుల సమర్పణ వాయిదా

మధురవాడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) ఇటీవల మధురవాడ పరిసర ప్రాంతాల్లో నిరుపేదలకు ఇళ్ళ స్థలాలు కోసం వ్యక్తిగతంగా సేకరించిన దరఖాస్తులు అధికారులకు సమర్పించడం వాయిదా వేసినట్టు సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మరుపిళ్ళ పైడిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. చినగదిలి మండల కార్యాలయంలో సోమవారం దరఖాస్తులు ఇవ్వాలని మొదట నిర్ణయించామని కానీ ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి కారణంగా వాయిదా పడిందన్నారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలకు సిద్ధం కావాలి

▸ టెన్త్ విద్యార్థులకు డీఈవో ప్రేమ్‌కుమార్ సూచన



విద్యార్థులతో ముచ్చటిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

పద్మనాభం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని విజయానంద పురం జడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అనంతరం నిర్వహిస్తున్న భౌతిక శాస్త్రం తరగతిని సందర్శించారు. విద్యార్థులు ఒత్తిడి లేకుండా చదివి, త్వరలో జరగనున్న టెన్త్ పరీక్షలు చక్కగా రాయాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులతో ముచ్చటించారు. సబ్జెక్టులకు సంబంధించి చర్చించారు. పరీక్ష కోసం ప్రణాళిక మేరకు చదవాలని సూచించారు. అనంతరం ఎస్ఏ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

ప్రముఖ రంగస్థల కళాకారుడు బీవీఎన్ పాత్రో కన్నుమూత



మధురవాడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ రంగస్థల కళాకారుడు, నంది, గరుడ అవార్డు గ్రహీత బుదరాయవలస వెంకట నరసింహపాత్రో (72) (బీవీఎన్ పాత్రో) ఆదివారం ఉదయం మధురవాడలోని స్వతంత్రనగర్ కాలనీలోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్నారు.ఈయన మిలటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్‌లో పని చేసి సుమారు పదేళ్ళ కిందట పదవీ విరమణ చేశారు. స్వస్థలం విజయనగరం జిల్లా మెరకముడిదాం. ఉద్యోగ రీత్యా సుమారు 40 ఏళ్ల కిందట మధురవాడ వచ్చి స్థిరపడ్డారు రంగస్థలంపై మక్కువతో తన పదిహేనేళ్ళ ప్రాయం నుంచి నాటకాల్లో వివిధ రకాల పాత్రలు పోషించారు. చింతామణి నాటకంలో సుబ్బిశెట్టి పాత్ర పాత్రోకు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు తెచ్చింది. ఈయనకు రాష్ట్ర ప్రభుత్వం నాటక ప్రదర్శనల్లో నంది అవార్డుతో సత్కరించింది. గరుడ అవార్డుతో పాటు ఎన్నో ప్రతిష్ఠాత్మక సంస్థలు అవార్డులు, రివార్డులు ఇచ్చి సత్కరించాయి. మధురవాడ పరిసరాల్లో కళాకారులను ప్రోత్సహించడానికి శ్రీనివాసా కల్చరల్ అసోసియేషన్ ఏర్పాటు చేసి దానికి ఆయన గౌరవాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ప్రతి ఏటా సింహాద్రి అవార్డులు కోసం నాటక పోటీలను ఏర్పాటు చేసి ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించేవారు. పాత్రో మృతి పట్ల కళా సంస్థలు, పలువురు కళాకారులు సంతాపం వ్యక్తం చేశాయి.

భీమిలి తీరంలో మృతిచెందిన చేపలు

▸ భద్రపరచగా చనిపోవడంతో పడేశామంటున్న కొందరు మత్స్యకారులు



భీమునిపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : భీమిలి జోనల్ కార్యాలయం వద్ద గల తీరంలో అధిక సంఖ్యలో చనిపోయిన చేపలు పడి ఉండడంతో కలకలం రేపింది. సముద్రంలో కాలుష్యం వల్ల తాబేళ్లు చనిపోతున్నాయని, అలాగే ఇప్పుడు చేపలు కూడా చనిపోతున్నాయని ప్రజల్లో ఆందోళన చెందారు. ఇందుకు సంబంధించి ఒక వీడియో సోషల్ మీడియాలో కూడా వైరల్ కావడం, చేపల మృతికి ఓ ఔషధ కంపెనీ కారణమంటూ ప్రచారం కావడం చర్చనీయాశంగా మారింది.

అయితే భీమిలి తోటవీధికి చెందిన సుమారు 30 బోట్లు శుక్రవారం సాయంత్రం వేటకు వెళ్లి అదే రోజు అర్ధరాత్రి ఒడ్డుకు చేరాయి. అందులో నాలుగు బోట్లకు కారలు అనే చేపలు పడ్డాయి. ముళ్లు ఎక్కువగా ఉండే వీటిని, ఆ అర్ధరాత్రి వల నుంచి తీస్తే చేతులకు గుచ్చుకొని గాయాల పాలవుతామనే ఉద్దేశంతో మత్స్యకారులు అదే బోట్లలో భద్రంగా దాచుకుని ఇళ్లకు వెళ్లిపోయారు.

మరుసటి రోజు వచ్చేసరికి ఆ చేపలు చనిపోయి ఉండడంతో వాటిని ఫిషింగ్ జెట్టీకి తరలించారు. అయితే అక్కడ ఎండబెట్టే అవకాశం లేకపోవడంతో ఆ చేపలను తిరిగి సముద్రంలో పడేశారు. ఆ చేపలు తీరానికి చేరడంతో చనిపోయాయంటూ ప్రచారం జరిగింది.

ఇదిలావుండగా, నగరానికి చెందిన సామాజికవేత్త ఈఏఎస్ శర్మ ఈ విషయమై కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్‌కు లేఖ రాశారు. చేపల మృతికి కారణం సమీపంలో ఉన్న దివీస్ ల్యాబరేటరీ కారణమని ఫిర్యాదు చేశారు.

నేడు చలో పీఎఫ్ కమిషనర్



సమావేశమైన కార్మిక సంఘాల నేతలు

తగరపువలస, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నంలో ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కమిషనర్‌ను కలిసి సమస్యలను నివేదించాలని ఆదివారం నిర్వహించిన అన్ని కార్మికసంఘాల సమావేశంలో తీర్మానించారు. కాంగ్రెస్ కార్మిక సంఘ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ దల్లి అప్పలరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల పీఎఫ్‌లో వ్యక్తిగత వివరాల మార్పులు, మారుపేరు, కార్మికుల పీఎఫ్ చెల్లింపు, పెండింగ్‌పీఎఫ్ బకాయిలను చెల్లింపు తదితర సమస్యలను కమిషనర్‌ను కలిసి విన్నవించనున్నట్టు చెప్పారు. సోమవారం ఉదయం 10 గంటలకు చిట్టివలసలో కార్మిక సంఘాల నేతలంతా కలిసి బయలుదేరి వెళ్లి కమిషనర్‌ను కలవాలని నిశ్చయించినట్టు తెలిపారు.సమావేశంలో కాంగ్రెస్ కార్మిక సంఘ కార్యదర్శి ఎం.ఆదినారాయణ, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొండపు ఈశ్వరరావు, టీఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి ఎస్ అచ్యుతరావు, కోశాధికారి దేముళ్లు తదితరులు పాల్గొన్నారు.

ధర్మబద్ధంగానే వాలి వధ

▸ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు

కొమ్మాది, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : వాలిని సంహరించినప్పుడు రాముడు ఎక్కడా ధర్మం తప్పలేదని, చనిపోవడానికి ముందు వాలి శ్రీరాముడ్ని అనేక ప్రశ్నలు అడగగా వాటన్నింటికి శ్రీరాముడు చెప్పిన సమాధానం విని తప్పు తెలుసుకుని ఒప్పుకుని తనకు ఈ శిక్ష సమంజసమేనని శ్రీరాముడికి నమస్కరించి వాలి ప్రాణాలు వదిలాడని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు.

కొమ్మాది గాయత్రి ఇంజనీరింగ్ మహిళా కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న సంపూర్ణ రామాయణం ప్రవచనాల్లో భాగంగా ఆదివారం కిష్కింధకాండలోని వాలి వధ వృత్తాంతాన్ని వివరించారు. దుందుభిని వాలి చంపి గిరగిరా తిప్పి చాలా దూరం విసరగా అతని శరీరం రక్తం చిమ్ముతూ మతంగ మహర్షి ఆశ్రమంలో పడగా, అందుకు ఆగ్రహించిన మహర్షి.. వాలి తన ఆశ్రమానికి ఒక యోజన దూరం వరకు వస్తే అతని తల ముక్కలై మరణిస్తాడని శపించాడు. వాలి మనుషులు వచ్చినా శిలలు మారిపోతారని శపించగా రక్షణ కోసం సుగ్రీవుడు ఆరుష్యమూక పర్వతం సమీపంలో నివాసం ఉంటున్నట్టు శ్రీరాముడికి తెలిపాడు. వాలి పరాక్రమం, వేగం, ఎంత గొప్పవో యద్ధానికి వెళ్లే ముందు శ్రీరాముడికి పదే పదే సుగ్రీవుడు అతని బలపరాక్రమం, అనేక ధర్మసూక్ష్మాలను వివరించాడు.

రోడ్డుపై గ్రావెల్.. శ్రమదానంతో తొలగించిన పోలీసులు

▸ కానిస్టేబుళ్లు సతీశ్, గణేశ్‌లకు స్థానికుల ప్రశంసలు



పారలతో గ్రావిల్‌ను తొలగిస్తున్న కానిస్టేబుళ్లు

భీమునిపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : గత కొన్ని సంవత్సరాలుగా పరిమితికి మించి గ్రావెల్ లోడుతో క్వారీ లారీలు ప్రయాణించడం పరిపాటైంది. అధిక లోడుతో ప్రయాణిస్తున్న ఈ లారీలు మార్గమధ్యలో స్పీడుబ్రేకర్లు, రోడ్డులో గోతులు ఉన్న చోట గ్రావెల్‌ను జారవిడిచి వెళ్లిపోవడం అంతే సాధారణంగా మారింది. ఆ విధంగా రహదారిపై పడిన గ్రావెల్‌ను గమనించని ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆ విధంగా ఆదివారం రాత్రి పరిమితికి మించి గ్రావెల్ లోడుతో బీచ్‌రోడ్‌లో ప్రయాణిస్తున్న లారీ తిమ్మాపురం నుంచి రామానాయుడు స్టూడియో వరకూ గ్రావెల్‌ను జారవిడుచుకొని వెళ్లిపోయింది. రోడ్డుపై ప్రమాదకరంగా పడి ఉన్న ఆ గ్రావెల్ విషయమై పోలీసు అధికారులకు కొందరు సమాచారం అందించారు. దీంతో పోలీసు సీఐ సుధాకర్ ఆదేశాలతో బీచ్ పెట్రోలింగ్ వాహన పోలీసు కానిస్టేబుళ్లు సతీశ్, గణేశ్ సమీప గ్రామంలోని ప్రజల వద్ద పారలు తీసుకొని వచ్చి గ్రావెల్‌ను రహదారి పక్కకు తొలగించారు. రాత్రి వేళ పోలీసు కానిస్టేబుళ్లు చేస్తున్న శ్రమదానం పట్ల పలువురు అభినందించారు. ఇదిలావుండగా పరిమితికి మించి గ్రావెల్ లోడులను తీసుకువెళుతున్న లారీలపై పోలీసులు పట్టుకుని జరిమానాలు విధిస్తే భవిష్యత్‌లో క్వారీ లారీ యజమానులలో మార్పు వస్తుందని పలువురు సూచిస్తున్నారు.

మోటార్ల కోసం మత్స్యకారుల ఎదురుచూపు



మోటారు లేని నాటుపడవతో చేపల వేట

భీమునిపట్నం (రూరల్), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) భీమిలి రూరల్ మండలంలో అనేక మత్స్యకార గ్రామాల్లో నాటు పడవలతో చేపలవేట చేస్తున్నారు. నాటు పడవకు మోటారును అమర్చుకోవడానికి రూ.40 వేలు వ్యయం అవుతుంది. సముద్రంలో పడవ వెళ్లే సమయంలో డీజిల్ కూడా అవసరం. గతంలో ఈ మోటార్లు అందించే సమయంలో మత్స్యశాఖ రాయితీపై సగం ధరకు మోటారు లభించేది. ఈ సదుపాయాన్ని నాలుగేళ్ల క్రితం తొలగించడంతో చాలా మంది నాటు పడవలపై ఆధారపడి ఆటుపోట్లు దాటుకుని సముద్రంలోకి వెళ్లి చేపలవేట చేస్తున్నారు. ఒక నాటు పడవపై నలుగురు మత్స్యకారులు ఆధారపడి జీవనాన్ని సాగిస్తుంటారు. వీరు ఉదయాన్నే తీరంలో ఉన్న పడవను తోసు కుని కెరటాలను దాటించవలసి ఉంటుంది. కెరటాలు దాటిన తర్వాత తెడ్లు వేస్తూ పడవను నడప డం చాలా సులభంగా ఉంటుంది. కానీ కెరటాలను దాటే సమయంలో ప్రతిసారి తీరానికి కొట్టుకుని వస్తుంది. అదే మోటారు ఉంటే నేరుగా కెరటాలను దాటుకుని సముద్రంలోకి వెళిపోవచ్చు. మోటారు ఉన్నట్లయితే చేపలు ఏ ప్రాంతంలో పడుతున్నాయో అక్కడికి నేరుగా చేరుకునే అవకాశం ఉంటుంది. శారీరక శ్రమ కూడా ఉండదు.

మోటార్ల కొరత

భీమిలి మండలంలో 14 తీర గ్రామాలున్నాయి. వీటిలో 18,400 మంది సముద్రంపై ఆధారపడి జీవిస్తున్నారు.వీరిలో 1,290 మందికి మాత్రం పడవలు ఉన్నాయి. వీటిలో కేవలం 420 మందికి మోటార్లు ఉన్నాయి మిగిలిన వారికి నాటు పడవలే ఆధారం. దివీస్ యాజమాన్యం తన పరిధిలో ఉన్న చిన నాగమయ్యపాలెం, అన్నవరం తదితర గ్రామాల్లో కొంత మంది మత్స్యకారులకు మోటార్లను అందించింది. అనేకమంది మోటార్లు లేక సముద్రపు వేటకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు కూడా ఈ మోటార్లు లేని పడవలకే ఎక్కువగా జరుగుతున్నాయి. రాయితీపై మోటార్లను అందించే పథకాన్ని పునరుద్ధరించాలని పలువురు మత్స్యకారులు కోరుతున్నారు.

జూకు సందర్శకుల తాకిడి

ఆరిలోవ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. మొత్తం3,396 మంది సందర్శించారు. వీరి నుంచి సుమారు రూ.2,66,870 టికెట్ల రూపంలో ఆదాయం సమకూరినట్టు జూక్యూరేటర్ మంగమ్మ తెలిపారు.

నేడు అంగన్‌వాడీ సిబ్బంది నిరసన కార్యక్రమం

విశాఖపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే కార్యకర్తలు, ఆయాల ప్రధాన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సోమవారం ఉదయం నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అసోసియేషన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలో పెందుర్తి, భీమిలి ప్రాజెక్టు కార్యాలయాలు, నగర పరిధిలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఈ నిరసనలు చేపట్టనున్నారు.

'రైతు రిజిస్ట్రేషన్' చేస్తేనే ప్రభుత్వ రాయితీలు



రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేస్తున్న దృశ్యం

భీమునిపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతులందరికీ ఫార్మర్ రిజిస్ట్రీ జారీ చేస్తోందని భీమిలి మండల వ్యవసాయాధికారి బి.శివకోమలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 14 అంకెలతో కూడిన నిర్దిష్ట గుర్తింపు కార్డు జారీ చేస్తుందన్నారు. రైతులు ప్రభుత్వ పథకాల ద్వారా రాయితీ పొందాలంటే వ్యవసాయ భూమి ఉన్న రైతు సేవ కేంద్రానికి పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్ కాపీ, 1-బి, ఆధార్‌కార్డు, మొబైల్ ఫోన్‌ను తీసుకొని వెళ్లి రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో పేరు నమోదు చేయించుకుని గుర్తింపు నంబరు పొందాలని ఆమె సూచించారు.

ప్రభాకరునికి భక్తుల కైమోడ్పులు

సింహాచలం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రత్యక్ష దైవంగా పూజలందుకునే ప్రభాకరునికి భక్తులు కైమోడ్పులు సమర్పించారు. మాఘ ఆదివారం కావటంతో కృష్ణాపురంలోని సప్తాశ్వరథమారూఢుడైన సూర్యనారాయణస్వామి దర్శనానికి ప్రభాత వేళ నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ ప్రాంగణంలో కొందరు సూర్యనమస్కారాలు చేయగా మరికొందరు దీపారాధనలు, పుష్పమాలికలు, పలురకాల పండ్లను నివేదించి తమ భక్తిని చాటుకున్నారు.

సింహాద్రినాథునికి స్వర్ణ సంపెంగల పూజ



స్వామి పూజకు ఉపయోగించిన స్వర్ణ సంపెంగలు

సింహాచలం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం వైభవంగా స్వర్ణ సంపెంగల పూజ నిర్వహించారు. ఆర్జిత సేవల్లో భాగంగా ప్రతి ఆది, గురువారాల్లో జరుగు స్వర్ణపుష్పార్చనలో పాల్గొనేందుకు రూ.2,116 రుసుము చెల్లించిన జంటను అనుమతిస్తారు. ప్రభాతారాధనల అనంతరం ఆలయ పద్మనిధి (భాండాగారం) నుంచి స్వర్ణ సంపెంగలను తీసి బేడామండప ప్రదక్షిణ జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల సమక్షంలో నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతినామానికి సర్వ సంపెంగలతో పూజలు చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలను స్వామివారికి సమర్పించి భక్తులకు వేదాశీర్వచనం, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. అనంతరం అదే వేదికపై ఉదయం అప్పన్నకు ఆర్జిత నిత్యకల్యాణాన్ని పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో నిర్వహించారు.

రూ.2 లక్షల విరాళం

ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి పార్వతీపురం మన్యం జిల్లా బలిజపేటకు చెందిన కళ్యంపూడి సత్యవతి రూ.2 లక్షలను నగదు రూపంలో విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని ఏఈఓ వెంపలి రాంబాబుకు అందజేయగా ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అంతరాలయంలో మూలవిరాట్ దర్శనం కల్పించారు. శేషవస్త్రంతో సత్కరించి వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అధికారులు అందజేశారు.



విరాళం అందజేస్తున్న కళ్యంపూడి సత్యవతి

దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి



సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాలమహానాడు నాయకులు

భీమునిపట్నం (రూరల్) ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): భీమిలి మండలం తాళ్లవలస ఎస్‌సి కాలనీలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదటి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. నియోజకవర్గ మాల మహానాడు అధ్యక్షుడు బి.సన్నిబాబు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. సంజీవయ్య వివిధ పదవుల ద్వారా అందించిన సేవలను గుర్తు చేశారు. మాలమహానాడు వ్యవస్థాపక కార్యదర్శి బాగం గోపాలరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పింఛన్ సదుపాయం, ఎస్సీ, బీసీలకు రిజర్వేషన్ శాతం పెంచిన ఘనత సంజీవయ్యదేనని పేర్కొన్నారు. సంజీవయ్య మనుమడు వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడని, ఈ కుటుంబాన్ని ఆదుకోవడమే మాజీ ముఖ్యమంత్రికి ప్రభుత్వం ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర కన్వీనరు ఎం.శివ, విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.వి.కుమార్, ఆనందపురం అధ్యక్షుడు ఎస్.రాంబాబు, బోని ప్రసాద్, బొడ్డు నర్సింగరావు పాల్గొన్నారు.

గ్రానైట్ పలకల మధ్య నలిగిన ఇద్దరు యువకులు

తప్పిన ప్రాణాపాయం



108 వాహనంలో బాధితుడు



సంఘటన స్థలం నుంచి గాయపడిన యువకుడిని ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

సాగర్‌నగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గుడ్లవానిపాలెం బీచ్‌రోడ్డులో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనం వద్దకు లారీలో తీసుకువచ్చిన గ్రానైట్ పలకలు కిందికి దింపే క్రమంలో ఆదివారం ఉదయం జరిగిన ప్రమాదంలో ఇద్దరు కూలీలు పలకలు మధ్య తీవ్రంగా నలిగి ప్రాణాపాయస్థితి నుంచి బయటపడ్డారు. వివరాలు ఇలా వున్నాయి. ఈ ప్రమాదంలో ఒడిశాలోని హంపావల్లి ప్రాంతానికి చెందిన గణేష్ (18) అనే యువకుడు తీవ్ర అస్వస్థతకు గురికాగా, లక్ష్మణ (25) అనే యువకుడి కాలు విరిగింది. గ్రానైట్ పలకలు లారీ నుంచి కిందికి దింపే క్రమంలో వారిపై పలకలు పడ్డాయి. ఇద్దరూ చాలాసేపు ఆర్తనాదాలు చేశారు. సమీపంలో పనిచేస్తున్న కూలీలు స్థానికుల సహాయంతో పలకల మధ్య నుంచి బయటకు తీసి 108 వాహనంలో గీతం ఆసుపత్రికి తరలించారు. ఇద్దరూ కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. ఆరిలోవ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో ఐపీఎల్ సందడి

... 5వ పేజీ తరువాయి

కార్యవర్గం ఏర్పడడంతో మ్యాచ్‌లను విజయవంతంగా నిర్వహించేందుకువీలుగా ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు. కాగా ఐపీఎల్ మ్యాచ్‌లు ఇక్కడ నిర్వహించేలా కృషిచేసిన ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని చిన్ని, ఉపాధ్యక్షుడు పి.ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి సానా సతీష్‌లకు ఔత్సాహిక క్రికెటర్లు, అభిమానులు అభినందనలు తెలియజేస్తున్నారు. పకడ్బందీగా మ్యాచ్‌లను నిర్వహించాలని కోరారు.

ఏయూ దూర విద్యలో లేటరల్ ఎంట్రీ దుమారం

... 5వ పేజీ తరువాయి

అడ్మిషన్లకు ముందుగా నోటిఫికేషన్ ఇస్తారు. లేటరల్ ఎంట్రీలకు కూడా ఇది అవసరం. కానీ ప్రస్తుతం నోటిఫికేషన్ ఇవ్వకుండానే ప్రవేశాల ప్రక్రియను ప్రారంభించినట్టు తెలుస్తోంది. దీనిపై దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ్‌మోహన్‌ను వివరణ కోరగా విద్యార్థులకు మేలు చేకూరుతుందన్న ఉద్దేశం తోనే లేటరల్ ఎంట్రీ విధానంలో ప్రవేశాలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. ఏయూ పరిధిలోని విద్యార్థులకు మాత్రమే ఈ అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు అనేక కారణాలతో వందలాది మంది డిగ్రీలను మధ్యలోనేవదిలేశారని, వారికి మేలు చేయడమే ధ్యేయమని, ఉన్నతాధికారుల అనుమతితోనే ప్రక్రియను ప్రారంభించామన్నారు.

అసంపూర్తిగా హుద్‌హుద్ ఇళ్లు

... 5వ పేజీ తరువాయి

వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయడానికి టెండర్లు పిలుస్తున్నా ఒక్కరు కూడా ముందుకు రావడం లేదు. చివరకు గత ఏడాదిలో సవరించిన రేట్ల మేరకు కొమ్మాది, పరదేశిపాలెంలో రూ.2.25 కోట్లతో టెండర్లు పిలిచినా స్పందన లేదు.

తాజాగా మరోసారి టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్లు ముందుకు రానప్పుడు హౌసింగ్ కార్పొరేషనే స్వయంగా పనులు పూర్తిచేయవచ్చు. అయితే సంస్థ పరంగా ఉన్నతాధికారులు ఆ దిశగా నిర్ణయం తీసుకోవడం లేదు. ఇదిలావుండగా టీడీపీ ప్రభుత్వ హయాంలో మిగిలినచోట్ల నిర్మించిన ఇళ్లను 2018లో లబ్ధిదారులకు కేటాయించారు. కొమ్మాది, పరదేశిపాలెంలో 804 ఇళ్లకు కూడా లబ్ధిదారులను ఎంపిక చేశారు. అయితే అక్కడ కనీస సదుపాయాలు లేకపోవడంతో ఎవరూ నివాసం ఉండడం లేదు.

ఇళ్ల నిర్మాణం ఎప్పుడు పూర్తిచేస్తారా... అని గడచిన ఐదారేళ్ల నుంచి లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

బెట్టింగ్, లోన్‌యాప్‌లపై సీపీ దృష్టి

... 5వ పేజీ తరువాయి

ముఠాలకు నగరంలో చోటులేకుండా చేయాలని సీపీ శంఖబ్రతబాగ్చి కంకణం కట్టుకున్నారు. అందుకోసం తీసుకోవాల్సిన చర్యలు, నిఘా పెట్టాల్సిన వ్యక్తులపై టాస్క్‌ఫోర్స్, సైబర్ క్రైమ్ అధికారులకు సూచనలు జారీ చేశారు. చాంపియన్స్ ట్రోఫీ, ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) క్రికెట్ టోర్నమెంట్‌లు ప్రారంభం కానున్న నేపథ్యంలో బెట్టింగ్ జోరు పెరిగే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. ఐపీఎల్ ప్రారంభమైతే చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ బెట్టింగ్‌కు దిగడం పరిపాటనే భావన ఉంది. ఐపీఎల్ పూర్తయ్యేసరికి ఎంతోమంది బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోతుంటారే ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో బెట్టింగ్‌ను కట్టడిచేసేలా పూర్తిస్థాయిలో నిఘా పెట్టాలని సీపీ అధికారులను ఆదేశించారు.

సాంకేతికత సాయంతో...

బెట్టింగ్ అంతా మొబైల్‌యాప్‌ల ద్వారానే జరుగుతుండడంతో ఆయా యాప్‌లను గుర్తించి, వాటిని నగరంలో డౌన్‌లోడ్ చేసుకుంటున్న వారిని పట్టుకోగలిగితే లక్ష్యం చేరవచ్చని సీపీ భావిస్తున్నారు. ఇందుకోసం నగర పరిధిలోని ఇంటర్నెట్ వినియోగించే సెల్‌ఫోన్‌లు, కంప్యూటర్, లాప్‌టాప్‌ల ఐపీ నంబర్లు ఆధారంగా గూగుల్‌ప్లేస్టోర్‌లో బెట్టింగ్‌యాప్‌లను బ్రౌజింగ్ చేసే వారిని గుర్తించడంపై దృష్టిపెట్టారు. అలా గుర్తించేందుకు అవకాశం ఉందా? లేదా? అనే దానిపై కొంతమంది సాంకేతిక నిపుణులు, వెబ్‌సైట్ల డిజైనర్లతో సీపీ ప్రాథమికంగా చర్చించినట్టు ప్రచారం జరుగుతోంది. అలాగే ఇన్‌స్టెంట్ లోన్ పేరుతో భారీస్థాయిలో మోసా లు జరుగుతుండడంతో వాటిపైనా సీపీ దృష్టిపెట్టారని పోలీస్ అధికారులు చెబుతున్నారు. ఇన్‌స్టెంట్ లోన్ తీసుకోవాలంటే మొబైల్ యాప్‌లను డౌన్‌లోడ్‌చేసుకోవాల్సిందే. కాబట్టి అలాంటి యాప్‌లను డౌన్‌లోడ్‌చేసేవారిని గుర్తించాలని సీపీ సాంకేతిక నిపుణుల వద్ద అభిప్రాయపడినట్టు పేర్కొంటున్నారు. ఒకవేళ బెట్టింగ్, లోన్‌యాప్‌ల డౌన్‌లోడ్‌లను ఐపీ నంబర్ల ఆధారంగా గుర్తించే అవకాశం ఉంటే నగరంలో బెట్టింగ్, లోన్‌యాప్‌ల ఆగడాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్టపడడం ఖాయమని పోలీసు అధికారులు అభిప్రాయపడుతున్నారు.

స్టాల్స్ లేని రైతులకూ రైతుబజార్‌లో అవకాశం

విశాఖపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రైతులు తాము పండించిన కూరగాయలను నేరుగా రైతుబజార్లలో విక్రయించుకోవచ్చునని సహాయ మార్కెటింగ్ సంచాలకులు, జాయింట్ కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఎక్కువ మొత్తంలో కూరగాయల దిగుబడి వస్తున్నదని, వాటికి తమ ప్రాంతంలో తగిన ధర రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో మార్కెటింగ్ శాఖ ద్వారా రైతుబజార్లలో ఆ రోజు ధరకు అమ్ముకోవచ్చునన్నారు. ఈ విషయంలో ఇబ్బందులు ఎదరైతే అందుబాటులో ఉన్న ఉద్యానవనశాఖ అధికారులు, మార్కెటింగ్ కమిటీ కార్యదర్శులకు ఫిర్యాదు చేయాలన్నారు సందేహాలుంటే 99595 92474 నంబరులో సంప్రతించాలన్నారు.

వైసీపీ హయాంలో నాలా కుంభకోణం

- జిల్లాలో రూ.700 కోట్ల బకాయిలు
- జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్



విశాఖపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో పెద్దఎత్తున నాలా పన్ను కుంభకోణం జరిగిందని జనసేన కార్పొరేటర్ పీతలమూర్తియాదవ్ ఆరోపించారు. హోటల్ మేఘాలయలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో నాన్ అగ్రికల్చరల్ లాండ్ అసెస్‌మెంట్ (నాలా) బకాయిలు రూ.700 కోట్లు ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలైనా కొంతమంది అధికారులకు వైసీపీ వాసనలు పోలేదన్నారు. విశాఖ రెవెన్యూ డివిజన్ పరిధిలో సుమారు రూ.వంద కోట్లు బకాయిలుండగా గాజువాక పరిధిలోనే రూ.64 కోట్లు ఉన్నా యన్నారు. పెందుర్తి మండలం పరిధిలో 43.77 కోట్లు, భీమిలి రెవెన్యూ డివిజన్ పరిధిలో రూ.88.71 కోట్లు, విశాఖ రూరల్ పరిధిలో రూ.307.47 కోట్లు, భీమిలి మండల పరిధిలో రూ.204 కోట్లు బకాయిలున్నాయన్నారు. ఎవరైనా అగ్రికల్చర్ లాండ్‌లో లేఅవుట్ వేయాలంటే నాలా కట్టిన తర్వాతే వీఎంఆర్‌డీఏ అనుమతి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. జీవీఎంసీ పరిధిలోనాలా కట్టిన తర్వాత భవన నిర్మాణానికి అనుమతులు, నిర్మాణం పూర్తైన తర్వాత ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీచేయాలన్నారు. కొంతమంది రెవెన్యూ, జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులకు ముడుపులు చెల్లించి నాలా ఎగ్గొడుతున్నారన్నారు. దీనిపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టిసారించాలన్నారు.

సినిమా గైడ్

- **లైలా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం),
- **తండేల్:** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ(గోపాలపట్నం), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
- **మదగజరాజా:** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం),
- **సంక్రాంతికి వస్తున్నాం:** శారద, మెలోడీ, జగదాంబ, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, శ్రీకన్య, కిన్నెర, సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్:** మెలోడీ, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 35, టమాటా 10, వంకాయలు (తెలుపు)14, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 40, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 34, బీరకాయలు 54, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 12, క్యారెట్ 26 దొండకాయలు 24, బంగాళ దుంపలు 13, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది)45, బరబాటి 26, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 70, బద్దచిక్కుడు 26, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 36, కీరదోస 30, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 32 చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 28, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	90
లైవ్ ధర	100
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200

ఏయూ మైదానంలో మందుబాబుల ఆగడాలు

- ఆ మార్గంలో వెళ్లాలంటేనే వణుకుతున్న జనం
- పెట్రోలింగ్ నిర్వహించని పోలీసులు
- పట్టించుకోని వర్సిటీ భద్రతా సిబ్బంది

మద్దిలపాలెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానం మందుబాబులకు అడ్డాగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చీకటి పడితే మందుబాబులు మద్యం సీసాలతో లోపలకు చొరబడుతున్నారు.మైదానం నిర్మానుష్యంగా ఉండడంతో అక్కడే మద్యం తాగుతున్నారు. ఇదే రోడ్డులో కొద్దిగా ముందుకు ఇంజనీరింగ్ కళాశాల గర్ల్స్ హాస్టల్ ఉంది. వసతిగృహాలకు వెళ్లే విద్యార్థినులు సాయంత్రం వేళలో మైదానం రోడ్డులోనే ప్రయాణిస్తారు. ఎక్కువ మంది యువతులు నడుచుకుంటూ వెళుతుంటారు. ఆకతాయిలు మద్యం సేవించి అదే రోడ్డులో సంచరించడంతో యువతులు భయాందోళనలకు గురవుతున్నారు. గతంలో త్రీటౌన్ పోలీసులు రాత్రి సమయంలో మైదానం మొత్తం కలియతిరిగేవారు. ముగ్గురు, నలుగురు యువకులు కనిపిస్తే అక్కడ నుంచి వెంటనే పంపించి వేసేవారు. ఇటీవల పోలీసులు మైదానంలో తనిఖీలు చేయకపోవడంతో మందుబాబులు మద్యం సేవించడానికి మైదానానికి చేరుకుంటున్నారు. మద్యం సేవించి ఖాళీ సీసాలనే అక్కడే వదిలి వెళుతున్నారు. అంతేకాకుండా అర్ధరాత్రి వరకూ మైదానంలో మద్యం తాగుతూ వారిలో వారే గలాటాకు దిగుతుంటారు.



ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఉన్న ఖాళీ మద్యం సీసాలు

ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు కూడా జరుగుతుంటాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటిని అడ్డుకోవాల్సిన ఏయూ సెక్యూరిటీ సిబ్బంది పట్టించుకోవడం లేదని పలువురు అంటున్నారు. మందుబాబులు వద్ద చిల్లర తీసుకుని చూసీచూడనట్టు వదిలేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ సమస్యపై పోలీసులు, ఏయూ అధికారులు దృష్టి సారించాలని విద్యార్థులు కోరుతున్నారు.

క్యాన్సర్ రహిత సమాజమే ధ్యేయం

- ప్రముఖ సినీ నటి, లైఫ్ అగైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు గౌతమి
- బీచ్‌రోడ్డులో సందడిగా పింక్ సఖీ శారీ వాక్ ర్యాలీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): భయాన్ని వీడి పోరాడితే క్యాన్సర్‌ను అధిగమించవచ్చుని, క్యాన్సర్ రహిత సమాజం కోసం కృషి చేయాలని సినీ నటి, లైఫ్ అగైన్ ఫౌండేషన్‌వ్యవస్థాపకురాలు గౌతమి పేర్కొన్నారు.

రౌండ్ టేబుల్ లేడీస్ సర్కిల్ ఆఫ్ ఇండియా, రోహిత్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం బీచ్ రోడ్డులో నిర్వహించిన పింక్ సఖీ శారీ వాక్‌లో ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ వస్తే అధైర్యపడవద్దన్నారు. ఈ వ్యాధిపై అపోహలున్నాయని, అవగాహన పెంచుకుని, భయాన్ని దూరం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తూ సాగాలన్నారు. ధైర్యంగా ఉంటే జీవితాల్లో కొత్త వెలుగులు నింపుకోవచ్చన్నారు. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి మాట్లాడుతూ మహిళలకు ఇటీవల బ్రెస్ట్ క్యాన్సర్ ఎక్కువగా వస్తోందని, భయంతో కుంగిపోకుండా ధైర్యంగా పోరాడితే వ్యాధిని దూరం చేసుకోవచ్చన్నారు. 40 సంవత్సరాలు దాటిన మహిళలంతా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న వారికి ధైర్యం ఇవ్వాలని, వారిని ప్రేమగా పలకరించాలన్నారు.



బెలూన్లు ఎగురవేసి శారీ వాక్ ప్రారంభిస్తున్న సినీ నటి గౌతమి, మేయర్ హరివెంకటకుమారి, తదితరులు

కార్యక్రమానికి శిల్పా చక్రవర్తి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. గురుద్వార్ సత్సంగ్ అధ్యక్షుడు పీఎస్ ఆనంద్, ఏజ్ కేర్ ఫౌండేషన్ ప్రతినిధి ఎస్ఎస్ రాజు, రవీంద, వరుణ్ గ్రూప్ సంస్థల చైర్మన్ ఎస్పీ ప్రభు కిశోర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గవర కార్పొరేషన్ డైరెక్టర్ రవికుమార్‌కు సన్మానం

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ నియామక పత్రాలను అందుకున్న, టీడీపీ 15వ వార్డు ప్రధాన కార్యదర్శి, శ్రీసీతారామ సేవా సంఘం ఆడిటర్ మళ్ల రవికుమార్‌ను ఆదివారం సాయంత్రం శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. రామాలయం ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు, మహిళలు, రవికుమార్ కుటుంబీకులు, స్నేహితులు, బంధువులు పాల్గొని ఆయనను దుశ్శాలువాలను, పుష్పమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం తరపున షీల్డ్, సన్మాన పత్రాన్ని బహూకరించారు. అంతకుముందు పలువురు వక్తలు మాట్లాడుతూ రవికుమార్ చేస్తున్న సమాజ సేవకు గుర్తింపు లభించినట్టుగా ఆయనకు ఈ పదవి లభించడం తమ గ్రామానికే గర్వకారణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తనకిచ్చిన పదవి ద్వారా గవర కులస్థుల అభివృద్ధికి కృషి చేస్తానని రవికుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, సంఘం గౌరవ అధ్యక్షుడు పీల వెంకట పరదేశినాయుడు, అధ్యక్షుడు ఆడారి పరదేశినాయుడు, ఉపాధ్యక్షులు కర్రి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి యల్లపు నాగరాజు, కార్యదర్శి ఆడారి శివప్రకాష్, కోశాధికారి పొలమరశెట్టి త్రినాథ్, సహాయ కార్యదర్శులు మళ్ల శ్రీను, కర్రి గోవింద్, రాజగిరి సురేష్, ఇతర గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.



రవికుమార్‌ను సన్మానిస్తున్న సంఘం కార్యవర్గ ప్రతినిధులు

గౌరీ జ్ఞానలింగేశ్వరాలయం సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య ప్రదాతశ్రీసూర్యనారాయణ స్వామి ప్రజలందరికీ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కొత్త వెంకోజీపాలెంలోని శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయం ప్రధానార్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్‌శర్మ అభిలాషించారు. మాఘ ఆదివారం పురస్కరించుకుని ఉదయం నుంచి సూర్యదేవునికి ప్రత్యేక అభిషేకాలు, నమస్కారాలు జరిపారు. అర్చకులు సుబ్రహ్మణ్య శాస్త్రి,బాల భాస్కరశర్మ, గ్రామస్థులు పాల్గొన్నారు. హెచ్‌బీ కాలనీ శివాలయంలోని వేంచేసి ఉన్న సూర్యనారాయణ స్వామి ఆలయంలో తెల్లవారు జాము నుంచి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు జరిపారు. అనంతరం సూర్యనారాయణ స్వామికి కల్యాణం జరిపారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులతో శ్రీస్వామివారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, భక్తుల గోత్రనామాలతో అర్చకులు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

కుంభమేళాకు వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో రామ్‌నగర్ వాసి మృతి

రామ్‌నగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మహా కుంభమేళాకు వెళ్ళి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై రామ్‌నగర్ కు చెందిన వ్యక్తి మృతి చెందాడు. విశాఖలోని రామ్‌నగర్‌లో నివాసం ఉంటున్న గుంటుబోయిన అప్పల రాజు (65) రిటైర్డ్ పోర్టు ఉద్యోగి. ఈ నెల 9న అప్పలరాజు.. భార్య, కొంతమంది బంధువులతో కలసి ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు వెళ్లారు. కుంభమేళాలోస్నానాలు, దర్శనాల అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ప్రయాణంలో ఉండగా మార్గంమధ్యలో ఓ చోట రైలు దిగారు. తిరిగి రైలులో ఎక్కేందుకు వస్తుండగా ఓ వాహనం ఢీకొని మృతి చెందారు.

ఈ విషయాన్ని అక్కడి పోలీ సులు త్రీటౌన్ పోలీసులకు తెలియజేశారు. స్థానిక పోలీసుల రామ్‌నగర్‌లో ఉంటున్న అతడి కుటుంబ సభ్యులకు విషయాన్ని చేరవేశారు.

మద్యం మత్తులో వ్యక్తిపై దాడి : రూ.5 వేలు అపహరణ

పెందుర్తి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వేపగుంట సమీపంలోని నాయుడుతోట వద్ద ఓ వ్యక్తిపై నలుగురు యువకులు దాడి చేసి కొట్టడంతో తీవ్రంగా గాయపడాడు. పెందుర్తి క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వడ్లపూడికి చెందిన సాయికిరణ్ (46) అనే రైల్వే ఉద్యోగికి నాయుడుతోట వద్ద సొంతిల్లు ఉంది. ఆ ఇంటినిచూసుకునేందుకు ఆదివారం సాయంత్రం ఆయన ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా విరాట్‌నగ ర్‌లో ఉంటున్న ప్రసాద్ అనే స్నేహితుడితో కలిసి బార్‌లో సాయికిరణ్ మద్యం సేవించారు. అనంతరం సాయికిరణ్ వడ్లపూడి వెళ్లేందుకు క్యాబ్ బుక్ చేసుకుని నాయుడుతోట బస్టాప్ వద్ద వేచివున్నారు. ఆ సమయంలో బస్టాప్ వద్ద మద్యం సేవించి ఉన్న నలుగురు యువకులు ఉన్నారు. సాయికిరణ్‌కు వారితో ఏదో విషయంలో గొడవ జరిగింది. దీంతో ఆ నలుగురు యువకులు సాయికిరణ్‌ను చితకబాది ఆయన వద్దనున్న రూ.ఐదు వేలను లాక్కుని పారిపోయారు. తీవ్రంగా గాయపడిన సాయికిరణ్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించగా వైద్యులు నాలుగు కుట్లు వేశారు. అనంతరం సాయికిరణ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్యవైశ్యుల జిల్లా నూతన కార్యవర్గం

గాజువాక, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా ఆర్యవైశ్యుల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం గాజువాకలోని గుండా గురుమూర్తి కల్యాణ మండపంలో జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా బెల్లాల పెంటబాబు, కార్యదర్శిగాగునిశెట్టి అప్పలసత్యనారాయణ గుప్తా, కోశాధికారిగా కట్టా సత్యానందం, యువజన సంఘం అధ్యక్షుడిగా కందుల సాయి సత్యనారాయణ, కార్యదర్శిగా రెంటాల సుధాకర్, కోశాధికారిగా కె.గుప్తాలతో పాటు పలువురు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ, కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారి టీ చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కార్యవర్గ ప్రతినిధులు

కుక్కల దాడిలో జింకకు గాయాలు

- ఈ నెల ఇది మూడో ఘటన



కుక్కల దాడిలో గాయపడిన జింక

ఆరిలోవ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యంగా కారణంగా కుక్కల దాడిలో ఒక గాయపడింది. ఆదివారం మధ్యాహ్నం ఎండాడలో గల కేవీఆర్ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లోకి ఒక జింక వచ్చింది. దానిని చూసిన కుక్కలు దానిపై దాడి చేశాయి. స్థానికులు గమనించి వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ శాఖ రేంజర్ శాస్త్రి, డీఆర్వో కోటేశ్వరరావు, అసిస్టెంట్ బీట్ అధికారి భాను వచ్చి పరిశీలించారు. వెంటనే జింకకు జూలోని పశువైద్యులతో వైద్యం చేయించారు.

కాగా, జూలోని జింకలు తరచూ రోడ్డు పైకి రావడంతో కుక్కల దాడికి గురవుతున్నాయి. ఈ నెలలో ఇలాంటి సంఘటన మూడోది కావడం గమనార్హం. జింకలు బయటకు రాకుండా సరైన చర్యలు తీసుకోవాలని జంతు ప్రేమికులు, స్థానికులు కోరుతున్నారు.. కంబాలకొండ క్రాస్ వద్ద జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ప్రాంతాల్లో ఎత్తయిన ప్రహరీలు నిర్మించాలని కోరుతున్నారు.

పర్యాటక ఉద్యోగులకు వెంటనే వేతనాలు చెల్లించాలి : సిటు

సాగర్‌నగర్, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): రుషికొండ బీచ్‌లో పర్యాటకశాఖ వద్ద పనిచేస్తున్న 38 మంది ఉద్యోగులకు బకాయిపడ్డ మూడునెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని వీఎమ్ఆర్‌పీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ప్రధానకార్యదర్శి విశ్వనాథరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిత్యం పర్యాటకులతో రద్దీగా ఉండే రుషికొండ బీచ్‌ను ఉద్యోగులు తమ శ్రమ ధారపోసి ఆహ్లాదకరంగా శుభ్రంగా ఉంచుతున్నారు. నెలలు తరబడి వేతనాలు చెల్లించకపోతే వారి కుటుంబాలు ఎలా బతికేది అని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు చెల్లించమని అడిగితే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరింపులకు దిగడాన్ని సీఐటీయూ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇచ్చే వేతనాలే అతి తక్కువ. ప్రతినెలా ఐదోతేదీ లోపు ఇవ్వకపోతే ఇంటి అద్దెలు, కరెంటు బిల్లులు, పిల్లల ఫీజులు, తదితర చెల్లింపులు ఎలా చెల్లిస్తారని ప్రశ్నించారు. బీచ్‌లో విధులు నిర్వర్తించడానికి ఉద్యోగులు అప్పులు చేయాల్సి వస్తోందన్నారు. పర్యాటక కేంద్రాలలో కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. టూరిజం రీజనల్ డైరెక్టర్ డివిజనల్ మేనేజర్ బెదిరింపులు ఆపి తక్షణం బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు.

రెండో రోజూ పర్యాటక శాఖ ఒప్పందం కార్మికుల ఆందోళన



రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేస్తున్న కార్మికులు

సాగర్‌నగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ రుషికొండలో పని చేస్తున్న ఒప్పంద కార్మికులు రెండోరోజైన ఆదివారం కూడా రోడ్డుపై బైఠాయించి నిరసనలు తెలిపారు. గత మూడునెలలుగా జీతాలు అందక ఒప్పంద కార్మికులు ఇబ్బందులకు గురిఅవుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం భోజన సమయంలో నిరసన తెలిపారు. ఆదివారం నిరసన ఉధృతం చేసి రుషికొండబీచ్‌లోకి వచ్చే రహదారిపై బైఠాయించారు. తక్షణం తమ జీతాలు విడుదల చేయాలని నినదించారు. ఈ నెల 7న జీతాలు విడుదల చేసినప్పటికీ ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు కొంతమంది అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు .రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి ఇటువంటి వ్యక్తులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు. ఆందోళన చేస్తున్న కార్మికుల వద్దకు పర్యాటక శాఖ ఆర్డీ రమణారావు వెళ్లి ఆందోళన విరమింపజేసే యత్నం చేశారు. ఒప్పంద కార్మికులతో మాట్లాడి విధులకు హాజరు కావాలని కోరారు.



శఠగోపాలను అందజేస్తున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధులు

అప్పన్నకు రెండు బంగారు పూత శఠగోపాలు బహూకరణ

సింహాచలం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామికి హరేకృష్ణ మువ్‌మెంటు గ్లోబల్ చైర్మన్ పద్మశ్రీ మధు పండితదాస సుమారు రూ.10 లక్షలు విలువైన బంగారు పూతతో రెండు శఠగోపురాలను కానుకగా బహూకరించారు. హరేకృష్ణ మువ్‌మెంటు విశాఖ శాఖ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస, ఇతర ప్రతినిధులతో కలిసి ఆదివారం ఆలయ ఏఈవో నక్కాన ఆనందకుమార్‌కు అందజేశారు. తొలుత అంతరాలయంలో స్వామి మూల విరాట్ సన్నిధిలో కానుకలను ఉంచి లోక కల్యాణార్థం అనే సంకల్పంతో ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు పూజలు చేశారు. ఈ సందర్భంగా మధుదాస మాట్లాడుతూ 52 ఏళ్ల క్రితం హరేకృష్ణ మువ్‌మెంటుకు చెందిన ప్రభుపాదుల వారు అప్పన్నను తొలిసారి దర్శించుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని 540 గ్రాముల స్వర్ణమాలాము చేసిన శఠగోపురాలను అప్పన్న సేవలకు అందజేసినట్టు చెప్పారు.

స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరణ చేయవద్దు

- పలు సంస్థల కాంట్రాక్టు కార్మిక సంఘాల నేతలు

సిరిపురం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయవద్దని సీఐటీయూ, బీహెచ్‌ఈఎల్, హెచ్‌ఎస్ఎల్, స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకిస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొనసాగుతున్న దీక్షల్లో ఆదివారం బీహెచ్‌ఈఎల్, హెచ్‌ఎస్ఎల్, స్టీల్‌ప్లాంట్ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో మంది ప్రాణత్యాగాలతో ఏర్పాటైన స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడం తగదన్నారు. పోరాటాల ద్వారా ఏర్పాటైన స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తున్న వారందరికీ పబ్లిక్ సెక్టార్ల యూనియన్ల అన్నీ అప్పటి నుంచి ఇప్పటి వరకు తాము పూర్తిస్థాయిలో మద్దతు తెలియజేస్తూనే ఉన్నామని గుర్తుచేశారు.కార్యక్రమంలో నాయకులు ఎస్.జగన్నాథరావు, ఎస్.ప్రసాద్, మసేన్, నారపరెడ్డి అప్పలరాజు, సోమేశ్‌రెడ్డి, ఆనందరావు, సూరీడు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో చికిత్స పొందుతూ రిమాండ్ ఖైదీ మృతి

ఆరిలోవ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న వ్యక్తి అనారోగ్యంతో చికిత్స పొందుతూ కేజీహెచ్‌లో మృతి చెందినట్టు జైలు సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

పాడేరుకు చెందిన పి.రాజబాబు (47) కొట్లాట కేసులో ముద్దాయి. కొయ్యూరు పోలీసుస్టేషన్‌లో ఇతడిపై కేసు నమోదైంది. 2024, నవంబర్ నుంచి విశాఖ కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న అతడికి కాళ్లు, చేతులపై వాపు రావడంతో జైలు వైద్యశాలలో చికిత్స అందించారు. శనివారం అతడి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మల్కాపురం పోలీస్ స్టేషన్ నుంచి ఇద్దరు గంజాయి నిందితుల పరారీ

- బేడీలను తొలగించుకుని కిటికీలో నుంచి దూకి పారిపోయిన వైనం
- తీవ్రంగా గాలిస్తున్న పోలీసులు

మల్కాపురం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గంజాయితో పట్టుబడిన ఇద్దరు నిందితులు మల్కాపురం పోలీస్ స్టేషన్ నుంచి తప్పించుకోవడం కలకలం రేపింది. ఇద్దరు నిందితుల చేతులకు బేడీలు వేసినప్పటికీ వాటిని ఎంతో చాకచక్యంగా తొలగించుకుని వారు కిటికీలో నుంచి దూకి పారిపోయారు. ఈ దృశ్యాలన్నీ స్టేషన్‌లోని సీసీ కెమెరాలో నమోదయ్యాయి. అనకాపల్లి జిల్లా కశింకోట ప్రాంతానికి చెందిన కొరిబిల్లి ప్రసాద్ (22), కిల్లి ప్రసాద్ (24)లు శనివారం మధ్యాహ్నం మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గల హెచ్‌పీ పెట్రో పార్కు సమీపంలో రెండు కిలోల గంజాయితో ఉన్నట్టు అందిన సమాచారం మేరకు నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని మల్కాపురం పోలీసులకు అప్పగించారు. వారిని పోలీసులు విచారించగా.. కశింకోటకు చెందిన ఓ వ్యక్తి తమకు గంజాయి ఇచ్చినట్టు చెప్పడంతో మల్కాపురం సీఐ విద్యాసాగర్ నిందితులు చెప్పిన చిరునామాకు వెళ్లారు. ఈలోగా మల్కాపురం పోలీస్ స్టేషన్‌కు గొడవ పడుతూ తల్లి, కూతురు వారిని వారించడానికి పోలీసులు బయటకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన నిందితులు బేడీలను తొలగించుకుని కంప్యూటర్ రూమ్‌లో ఉన్న కిటికీలో నుంచి బయటకు దూకి పోలీసుల పాత క్వార్టర్స్ నుంచి ఏకేసీ కాలనీ మీదుగా పారిపోయారు. కాగా తల్లీకూతుళ్ల గొడవ సద్దుమణుగయ్యాక పోలీసులు వచ్చి చూసేసరికి నిందితులు కనిపించలేదు. తప్పించుకున్న నిందితుల కోసం తీవ్రంగా గాలిస్తున్నామని సీఐ విద్యాసాగర్ తెలిపారు. కాగా నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు వారికి గంజాయి ఇచ్చిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ సంఘటన తరువాత స్టేషన్‌లోని కిటికీలను మార్పు చేసే పనిని పోలీసులు చేపట్టారు. సీఐ విద్యాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అతిగా మద్యం సేవించి కాలువలో పడి వ్యక్తి మృతి

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం సేవించి కాలువలో పడడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 88వ వార్డు పరిధి మంగళపాలెంలో మార్గాన శ్రీనివాస్ (45) భార్య శాంతి, ఇతర కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. స్థానికంగా గల ఓ ప్రైవేటు కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న శ్రీనివాస్‌కు రెండు రోజులు క్రితం జీతం రావడంతో అతిగా మద్యం సేవించసాగాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం పూటుగా మద్యం తాగి ఇంటికి సమీపంలో గల డ్రైనేజీ గోడపై కూర్చున్నాడు. ఇంట్లోకి రమ్మని కుటుంబ సభ్యులు పిలిచినా రాలేదు. కాగా ఆదివారం ఉదయం స్థానికులు చెత్త పారేయడానికి కాలువ వద్దకు వచ్చేసరికి శ్రీనివాస్ అందులో పడి మృతి చెంది ఉన్నట్టు గుర్తించారు. సమాచారం అందుకున్న దువ్వాడ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. శ్రీనివాస్ భార్య శాంతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీనివాస్ మృతదేహం

వెంకన్నను దర్శించుకున్న పోలీస్ కమిషనర్

సాగర్‌నగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : శ్రీమహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి రుషికొండ ఆలయం శ్రీవారిని ఆదివారం సాయంత్రం నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో టీటీడీ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



ఆలయం వద్ద సీపీ, తదితరులు

విద్యుత్ వినియోగదారుల సమస్య పరిష్కార వేదిక రేపు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్లపాలెం సెక్షన్ పరిధి అక్కయ్యపాలెం ఎనబై అడుగుల రోడ్డు మాదేటి గార్డెన్స్‌లోని శ్రీ గౌరీ పరమేశ్వర కల్యాణ మండపంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వినియోగదారులు తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కోరారు. ఈ సమావేశానికి సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యురాలు బి.సులేఖ రాణి, ఆర్థిక సభ్యుడు షేక్ బాబర్, స్వతంత్ర సభ్యుడు ఎస్.మురళీకృష్ణ హాజరవుతారని పేర్కొన్నారు.

ఉద్యోగాలకు కెమికల్ విద్యార్థుల ఎంపిక

కంచరపాలెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాల్లో ఆఖరి ఏడాది చదువుతున్న ఏడుగురు విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎంపికై ఉద్యోగాలు పొందినట్టు ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు. ప్లాస్టిక్స్ & పాలిమర్స్ బ్రాంచి నుంచి ముగ్గురు, ఆయిల్ టెక్నాలజీ బ్రాంచి ముగ్గురు, కెమికల్ విభాగం నుంచి ఒకరు ఎంపికయ్యారు. వీరు అనంతపురం జిల్లా తాడిపత్రి సమీపంలోని రెడ్డిపాళ్యం వద్ద అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్ కంపెనీలో విధులు చేపట్టాలి. వీరికి మొదటి ఏడాది వార్షిక వేతనం రూ.4లక్షలు చెల్లిస్తారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ, అధ్యాపకులు జయప్రకాశ్ రెడ్డి, ప్రశాంతికుమారి, దామోదర్, విజయలక్ష్మి, ట్రైనింగ్ & ప్లేస్‌మెంట్ అధికారి కుమార్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా మాధవ స్వామి ఆలయ వార్షిక తీర్థ మహోత్సవం



జలధార వద్ద మాఘ స్నానాల హడావుడి

మురళీనగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తరంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా ఉన్న పురాతన మాధవస్వామి ఆలయం వద్ద ఆదివారం వార్షిక తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. నెల రోజుల ఉత్సవాల్లో భాగంగా మాఘమాసం ఆదివారాల్లో ఇక్కడ ఆలయ దర్శనాలకు విచ్చేసే భక్తులకు దాతలు అన్నదానం చేపట్టారు. ఉదయం స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజాభిషేకాల అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఆలయ ఆవరణలో దాదాపు వెయ్యి మంది భక్తులకు అన్నదానం జరిపారు. కొండ దారిలో పరస తీర్థ మహోత్సవం సందడిగా మారింది. సింహాచలం దేవస్థానం ఉప ఆలయాలుగా ఉన్న ఇక్కడి దేవస్థానంలో సింహాచలం ఇఓ త్రినాథ్ పర్యవేక్షణలో వేడుకలు జరిగాయి. స్థానికులు, సుదూర ప్రాంతాల నుంచి భక్తులు ఉత్సవంలో పాల్గొన్నారు. ఈ నెల 28తో ఉత్సవాలు ముగియనున్నాయి.

రిమాండ్ ఖైదీ మృతి

ఆరిలోవ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న పాడేరుకు చెందిన పి.రాజబాబు (47) కిడ్నీ సమస్యతో చికిత్స పొందుతూ కేజీహెచ్‌లో మృతి చెందినట్టు జైలు సూపరింటెండెంట్ మహేశ్ బాబు తెలిపారు. కొయ్యూరు పోలీసుస్టేషన్‌లో ఇతడిపై కేసు నమోదైంది. 2024 నవంబరు నుంచి రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. అతడి కాళ్లు, చేతులపై వాపు రావడంతో తొలుత జైలు వైద్యశాలలో చికిత్స చేశారు.

స్కౌట్స్ రాష్ట్ర శాఖ నూతన కార్యదర్శిగా నరసింహారావు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఏపీ విద్యాశాఖ కమిషనర్, స్కౌట్స్ చీఫ్ కమిషనర్ వి.విజయరామరాజును రాష్ట్ర స్కౌట్స్ సంస్థ కార్యదర్శిగా సార్వత్రిక విద్యాపీఠం డైరెక్టర్ వి.నరసింహారావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు నరవ ప్రకాశరావు తెలిపారు. ఆయన నాయకత్వంలో సంస్థ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

చికెన్‌కు ముఖం చాటేసి.. మటన్‌కు ఎగబడి..



మాంసం దుకాణం వద్ద క్యూలో జనం

సీతమ్మధార, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇతర ప్రాంతాల్లో బర్డ్ ఫ్లూ వచ్చిందన్న వార్తలతో సుమారు 90 శాతం మంది కోడిమాంసం (చికెన్) కొనుగోలు చేయడం మానేశారు. ఈ సమాచారం బయటకు పొక్కనంత వరకు దుకాణాల్లో యథేచ్ఛగా చికెన్ అమ్మకాలు జరిగేవి. బర్డ్ ఫ్లూ వచ్చిందనే వార్త వ్యాపించడంతో నగరంలోని మటన్ దుకాణాలకు జనం ఎగబడ్డారు. ఆదివారం ఎక్కడ చూసినా జనంతో కిక్కిరిసి కనిపించి, మటన్‌కి డిమాండ్ పెరిగింది. పెద్ద సంఖ్యలో జనం ఎగబడడంతో గంటల తరబడి మటన్ కోసం నిరీక్షించవలసి వచ్చింది. మరోపక్క చికెన్ దుకాణాలు వెలవెలబోతూ కనిపించాయి. కోడిమాంసంపై అపోహలు వద్దని ప్రజాప్రతినిధులు, అధికారులు వివరణ ఇచ్చినా జనంలో నమ్మకం కుదరలేదు.

కిక్కిరిసిన రైతుబజార్

మాంసాహార ప్రియులు అనేక మంది కూరగాయల కొనుగోలుకు ఆసక్తి చూపడంతో రైతుబజార్లు కిటకిటలాడాయి. ఆదివారం ప్రతి రైతు బజార్ రద్దీగానే ఉంటుంది. అయితే చికెన్ తినే విషయంలో సందిగ్ధంలో ఉండడం, మాంసం దుకాణాల వద్ద రద్దీ పెరగడం, మాఘ ఆదివారం కావడం తదితర కారణాల రీత్యా రైతు బజార్లకు జనం పెద్దసంఖ్యలో వచ్చారు. సీతమ్మధార రైతుబజార్ జనంతో కిక్కిరిసి కనిపించింది.



జనంతో రద్దీగా కనిపిస్తున్న సీతమ్మధార రైతుబజార్



వెలవెలబోతున్న చికెన్ షాపు

ఉల్లి కోసం బారులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్‌లోని రైతు బజార్‌లో ఉల్లిపాయలు కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ఆదివారం బారులు తీరారు. కొద్ది రోజుల నుంచి ఉల్లి నిల్వలు అంతంత మాత్రమే ఉండడంతో వాటిని కొనుగోలు చేయాలంటే దొరికేవికావు. బహిరంగ మార్కెట్లలో వారికి నచ్చిన ధరకు విక్రయిస్తున్నారని, దీనివల్ల వాటిని కొనుగోలు చేయలేక చాలా ఇబ్బందులు పడుతున్నామని వినియోగదారులు చెబుతున్నారు. రైతుబజార్‌లో కిలో రూ.35లకు విక్రయించడంతో వినియోగదారులు ఎగబడ్డారు. దీంతో ఉల్లిపాయల కౌంటర్లు కొనుగోలుదారులతో కిక్కిరిశాయి.



ఉల్లి కౌంటర్ వద్ద గుంపుగా వినియోగదారులు

నాణ్యమైన కూరగాయలు విక్రయించాలి

రైతుబజార్‌ను మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కిరణ్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బజార్‌లోని స్టాల్స్ దగ్గరకు వెళ్లి కూరగాయల నాణ్యతను పరిశీలించారు. వినియోగదారులకు నాణ్యతగల కూరగాయలు విక్రయించాలని సూచించారు. బయట వ్యాపారుల వద్దకెళ్లిన ఆయన కూరగాయలు విక్రయిస్తే సహించేది లేదని, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్టేట్ అధికారి కొండబాబు ఉన్నారు.



టమాటా విక్రయిస్తున్న రైతుతో సంభాషిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ కిరణ్

నేటి నుంచి యూసీసీ టీ 20 క్రికెట్ టోర్నీ



జెర్సీలు ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ, వీడీసీఏ అనుబంధంతో యునైటెడ్ క్రికెట్ క్లబ్ నిర్వహించనున్న యూసీసీ టీ 20 క్రికెట్ టోర్నీ సోమవారం నుంచి జరగనుంది. ఇందులో పాల్గొనే 12 జట్లకు టీ షర్టులను నిర్వాహకులు ఆదివారం ఆవిష్కరించి సారథులకు అందజేశారు. వాల్తేరు రైల్వే స్టేడియంలో ఐదు రోజులు లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జరిగే ఈ టోర్నీలో 12 జట్లు ప్రాతినిధ్యం వహిస్తాయి. విజేతలకు నగదు ప్రోత్సాహం, ట్రోఫీలను ప్రదానం చేస్తారు. సామాజిక సేవా కార్యక్రమాల కోసం వివిధ సంఘాలకు రూ.లక్ష విరాళం ఇవ్వనున్నామని తెలిపారు. సోమవారం తొలిమ్యాచ్ తూర్పుకోస్తా రైల్వే-గాజువాక గ్రీన్స్ మధ్య జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కుంభమేళా ప్రయాణికులకు ప్రత్యేక భద్రత



ప్రయాణికులకు కరపత్రం అందజేస్తున్న రైల్వే ఉద్యోగి

విశాఖపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళా ప్రయాణికులకు భద్రత, సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని డీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహు పేర్కొన్నారు. ఆర్పీఎఫ్, జీఆర్పీ ప్రత్యేక బృందాలతో యాత్రికుల కదలికలపై నిరంతరం ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందన్నారు. వదంతులు నమ్మి అభద్రతా భావానికి గురికావద్దని, సురక్షితంగా ప్రయాణించాలని సూచించారు. ఆకస్మిక టికెట్ తనిఖీలు చేపట్టి ప్రయాణికులు సురక్షితంగా ఉండే చర్యలు చేపట్టామన్నారు. కనీస సౌకర్యాలు, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కుంభమేళా యాత్రికులకు కల్పిస్తున్న సదుపాయాలకు సంబంధించిన సమాచారాన్ని బుక్‌లెట్ రూపంలో పంపిణీ చేశామని పేర్కొన్నారు.

సబ్ ప్లాన్ నిధుల పెంపునకు విదసం డిమాండ్

మర్రిపాలెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పెంచాలని దళిత సంఘాల ఐక్య వేదిక (విదసం) రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. ఆదివారం మర్రిపాలెం జాజి ఓంకార్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో కన్వీనర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తొలి బడ్జెట్‌లో కేటాయింపులు సరిగా లేవన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఈ నెల 28న ప్రవేశ పెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గత సంవత్సరం రూ.18 వేల కోట్లు మాత్రమే కేటాయించారని ఈసారి 16 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదానీ సోలార్ కొనుగోలు ఒప్పందం రద్దు చేయాలని కోరారు.



మాట్లాడుతున్న బూసి వెంకటరావు

నేడు అంగన్‌వాడీ సిబ్బంది నిరసన

విశాఖపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే కార్యకర్తలు, ఆయాల ప్రధాన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సోమవారం ఉదయం నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అసోసియేషన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలో పెందుర్తి, భీమిలి ప్రాజెక్టు కార్యాలయాలు, నగర పరిధిలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఈ నిరసనలు చేపట్టనున్నారు.

వైభవంగా సంకష్టహర చతుర్థిపూజ

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పోర్టు ఆసుపత్రి ఎదురుగా ఉన్న లక్ష్మీ వినాయక ఆలయంలో సంకష్టహర చతుర్థి పూజను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గురుపాద సేవా సమితి ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు బాలానంద శివాచార్య స్వామి శైవ ఆగమ సాంప్రదాయంలో మంగళధ్వని, వేదమంత్రాలతో హోమం, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి విచ్చేయగా, ఆయనకు సాంప్రదాయ రీతిలో స్వాగతం పలికి ఆలయ సన్నిధానంలో గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో జీవించాలన్నారు. ఇటువంటి వైదిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల లోక కల్యాణం జరుగుతుందన్నారు. అనంతరం సీపీని గురుపాద సేవా సమితి సభ్యులు స్వామివారి శేష వస్త్రాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, సమితి సభ్యులు ఎంవీ రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



స్వామివారిని దర్శించుకుంటున్న పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తదితరులు

మార్చి 15న ఎఫ్‌టీపీసీ జాతీయ పురస్కారాలు ప్రదానం

మహారాణిపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విద్యా వైద్య, సినిమా, సామాజిక, సాంస్కృతిక, సేవా రంగాలలో విశేష సేవలు అందించిన వారికి సిటిజన్ ఫోర్స్ ఫౌండేషన్ ఫిలిమ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంస్థలు సంయుక్తంగా జాతీయ స్థాయి పురస్కారాలు అందించనున్నట్లు సిటిజన్ ఫోర్సు వ్యవస్థాపకుడు పి. రమేష్ బాబు తెలిపారు. ఆదివారం హోటల్ దసపల్లా ఎగ్జిక్యూటివ్ కోర్టులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్చి 15న విశాఖలోని చిల్డ్రన్ ఎరినాలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. తెలుగు రాష్ట్రాలు సహా దేశంలోని వివిధ రంగాల ప్రముఖులను సత్కరించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు మంత్రులు, ఎంపీలను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా అవార్డుల లోగోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నటి పాయల్ ముఖర్జీ, చైతన్య జంగా, పి.విజయ వర్మ తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

'అర్హులకు పథకాలు అందించే బాధ్యత మీదే'

జనసేనలో చేరిన నాయకులకు ఎమ్మెల్యే సూచన

సీతంపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): దక్షిణ ఎమ్మెల్యే, జనసేన జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ సమక్షంలో వైసీపీ, ఇతర సంఘాల నాయకులు ఆదివారం ఆ పార్టీలో చేరారు. సీతంపేట రాజేంద్రనగర్‌లోని జనసేన కార్యాలయంలో కనకమహాలక్ష్మి ఆలయం మాజీ చైర్మన్ కొల్లి సింహాచలం, వార్డులోని ఇతర నాయకులతో కలిసి పార్టీలో చేరడంతో ఎమ్మెల్యే శ్రీనివాస్ వారి మెడలో జనసేన కండువాలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జనసేనలో అందరికీ స్వేచ్ఛ ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అందరికీ చేర్చడంలో కొల్లి సింహాచలం, కార్పొరేటర్ సాదిక్‌లు బాధ్యత వహించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయడమే కాకుండా వార్డు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. 39వ వార్డు చెందిన జాలర్లు, శెట్టిబలిజ, వాడబలిజ, ముస్లిం మైనారిటీ నాయకులంతా జనసేన పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు, ఇతర ప్రతినిధులు నల్లి సోమేష్, పెద్ద సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.



జనసేన పార్టీలో చేరిన వారికి కండువా వేసి ఆహ్వానం పలుకుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ఆర్టీసీ ప్రయాణికుల అగచాట్లు

▸▸ బస్టాప్‌లలో ఆక్రమణలు... రోడ్లపైకి వచ్చిన దుకాణాలు

▸▸ నిలువ నీడలేక... ఎండలో నిరీక్షించలేక...



మాధవధార కళింగనగర్ బస్టాపులో నిల్చునే చోటులేకుండా వెలసిన దుకాణాలు

మురళీనగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆర్టీసీ ప్రయాణికులు మండుటెండలో బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. బస్టాప్‌లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైవే బస్టాపుల వద్ద, ఎగువ సీతమ్మధార, మురళీనగర్, కైలాసపురం 48ఎ ఆర్టీసీ బస్ రూట్లలో రోడ్లపైనే వేచి ఉంటున్నారు. హైవే రోడ్డులోని బిర్లా జంక్షన్ వద్ద బస్సుల కోసం రోజూ వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. వీరంతా నిలువ నీడ లేక పాస్ పోర్టు సేవా కేంద్రం ఎదుటే డివైడర్లపై నిల్చుని ఎండలో బస్సుల కోసం చూస్తుంటారు. ఇక్కడ బస్టాపు సమీపాన ఉన్న వాణిజ్య దుకాణాల సముదాయం యజమానులు బస్ షెల్టరు నిర్మాణం జరగనీయకుండా అడ్డుతగులుతున్నారనే వాదన ఉంది. షెల్టర్లు నిర్మిస్తే, తమ దుకాణ సముదాయానికి అడ్డుగా ఉంటుందన్నది వారి ఆలోచన. దీంతో నిత్యం ఎగువ మురళీనగర్, మాధవధార, దిగువ 104 ఏరియా ప్రాంతాల విద్యార్థులు, ఉద్యోగులకు నిలువ నీడ లేకుండా పోతుంది.

మాధవధారలోనూ అంతే..

హైవే రోడ్డుపై మాధవధార కళింగనగర్ వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు ఎండలోనే 48 ఎస్, 48 ఎ బస్సుల కోసం ఎదురు చూస్తుంటారు. ఇక్కడ రెండేళ్ల క్రితం వరకు కనీసం చెట్ల నీడ అయినా ఉండేది. ఇప్పుడు ఆ చెట్లను కూడా కొట్టేసి బస్టాప్‌లోనే బడ్డీలు, కూరగాయల వ్యాపారం చేస్తుండడంతో ప్రయాణికులకు నిలువ నీడ కరువవుతోంది. వేసవి ఎండలు ప్రారంభం కావడంతో జీవీఎంసీ అధికారులు, ఆర్టీసీ యంత్రాంగం సమన్వయంతో ఈ ప్రాంతాల్లో షెల్టర్లు నిర్మించాలని ప్రయాణికులు మొర పెట్టుకుంటున్నారు.

'సాహిత్య చిరంజీవి.. శారద సుబ్రహ్మణ్య అయ్యర్ నటరాజన్'



వేదికపై ఆసీనులైన సాహితీ ప్రముఖులు

సీతమ్మధార, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తమిళనాట పుట్టి, తెలుగు సాహిత్యానికి జీవితాన్ని అర్పించిన సాహిత్య చిరంజీవి శారద సుబ్రహ్మణ్య అయ్యర్ నటరాజన్ అని పలువురు కొనియాడారు. విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షుడు డాక్టర్ ఘండికోట రఘురామారావు అధ్యక్షతన పౌరగ్రంథాలయంలో ఆదివారం సుబ్రహ్మణ్య నటరాజన్ అయ్యర్ శత జయంతి సభ ఘనంగా నిర్వహించారు. సభకు ముఖ్యఅతిథిగా హాజరైన అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తమిళనాడులోని పుదుక్కోటిలో జన్మించిన శారద సుబ్రహ్మణ్య నటరాజన్ 12 ఏళ్ల వయస్సులో వృద్ధుడైన తన తండ్రితో బతుకు తెరువు కోసం 1937లో ఆంధ్రాలోని తెనాలికి వచ్చారన్నారు. శారద మద్రాసులో చదివింది ఏడో తరగతి అయినప్పటికీ తెనాలి సమాజాన్నే తెలుగు విశ్వవిద్యాలయంగా చేసుకుని భాషపై పట్టు సాధించి వందకు పైగా కథలు రాశారని తెలిపారు. అనంతరం కె.శరత్ చంద్ర సంపాదకత్వంలో ప్రచురించిన శారద కథలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రఘురామారావు, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, శరత్‌చంద్ర, జేపీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్, లోన్‌యాప్‌లపై సీపీ దృష్టి

... 5వ పేజీ తరువాయి

ముఠాలకు నగరంలో చోటులేకుండా చేయాలని సీపీ శంఖబ్రతబాగ్చి కంకణం కట్టుకున్నారు. అందుకోసం తీసుకోవాల్సిన చర్యలు, నిఘా పెట్టాల్సిన వ్యక్తులపై టాస్క్‌ఫోర్స్, సైబర్ క్రైమ్ అధికారులకు సూచనలు జారీ చేశారు. చాంపియన్స్ ట్రోఫీ, ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) క్రికెట్ టోర్నమెంట్‌లు ప్రారంభం కానున్న నేపథ్యంలో బెట్టింగ్ జోరు పెరిగే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. ఐపీఎల్ ప్రారంభమైతే చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ బెట్టింగ్‌కు దిగడం పరిపాటనే భావన ఉంది. ఐపీఎల్ పూర్తయ్యేసరికి ఎంతోమంది బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోతుంటారే ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో బెట్టింగ్‌ను కట్టడిచేసేలా పూర్తిస్థాయిలో నిఘా పెట్టాలని సీపీ అధికారులను ఆదేశించారు.

సాంకేతికత సాయంతో...

బెట్టింగ్ అంతా మొబైల్‌యాప్‌ల ద్వారానే జరుగుతుండడంతో యాప్‌లను గుర్తించి, వాటిని నగరంలో డౌన్‌లోడ్ చేసుకుంటున్న వారిని పట్టుకోగలిగితే లక్ష్యం చేరవచ్చని సీపీ భావిస్తున్నారు. ఇందుకోసం ఇంటర్నెట్ వినియోగించే సెల్‌ఫోన్‌లు, కంప్యూటర్, లాప్‌టాప్‌ల ఐపీ నంబర్లు ఆధారంగా గూగుల్‌ప్లేస్టోర్‌లో బెట్టింగ్‌యాప్‌లను బ్రౌజింగ్‌చేసే వారిని గుర్తించడంపై దృష్టిపెట్టారు. అలా గుర్తించేందుకు అవకాశం ఉందా? లేదా? అనేదానిపై కొంత మంది సాంకేతిక నిపుణులు, వెబ్‌సైట్ల డిజైనర్లతో సీపీ ప్రాథమికంగా చర్చించినట్టు ప్రచారం జరుగుతోంది. అలాగే ఇన్‌స్టెంట్ లోన్ పేరుతో భారీస్థాయిలో మోసాలు జరుగుతుండడంతో వాటిపైనా సీపీ దృష్టిపెట్టారని పోలీస్ అధికారులు చెబుతున్నారు. ఇన్‌స్టెంట్ లోన్ తీసుకోవాలంటే మొబైల్ యాప్‌లను డౌన్‌లోడ్‌చేసుకోవాల్సిందే. కాబట్టి అలాంటి యాప్‌లను డౌన్‌లోడ్‌చేసేవారిని గుర్తించాలని సీపీ సాంకేతిక నిపుణుల వద్ద అభిప్రాయపడినట్టు పేర్కొంటున్నారు. ఒకవేళ బెట్టింగ్, లోన్‌యాప్‌ల డౌన్‌లోడ్‌లను ఐపీ నంబర్ల ఆధారంగా గుర్తించే అవకాశం ఉంటే నగరంలో బెట్టింగ్, లోన్‌యాప్‌ల ఆగడాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్టపడడం ఖాయమని పోలీసు అధికారులు అభిప్రాయపడుతున్నారు.

నగరంలో ఐపీఎల్ సందడి

... 5వ పేజీ తరువాయి

కార్యవర్గం ఏర్పడడంతో మ్యాచ్‌లను విజయవంతంగా నిర్వహించేందుకు వీలుగా ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు. కాగా ఐపీఎల్ మ్యాచ్‌లు ఇక్కడ నిర్వహించేలా కృషిచేసిన ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని చిన్ని, ఉపాధ్యక్షుడు పి.ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి సానా సతీష్‌లకు ఔత్సాహిక క్రికెటర్లు, అభిమానులు అభినందనలు తెలియజేస్తున్నారు. పకడ్బందీగా మ్యాచ్‌లను నిర్వహించాలని కోరారు.

అసంపూర్తిగా హుద్‌హుద్ ఇళ్లు

... 5వ పేజీ తరువాయి

వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయడానికి టెండర్లు పిలుస్తున్నా ఒక్కరు కూడా ముందుకు రావడం లేదు. చివరకు గత ఏడాదిలో సవరించిన రేట్ల మేరకు కొమ్మాది, పరదేశిపాలెంలో రూ.2.25 కోట్లతో టెండర్లు పిలిచినా స్పందన లేదు. తాజాగా మరోసారి టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్లు ముందుకు రానప్పుడు హౌసింగ్ కార్పొరేషనే స్వయంగా పనులు పూర్తిచేయవచ్చు. అయితే సంస్థ పరంగా ఉన్నతాధికారులు ఆ దిశగా నిర్ణయం తీసుకోవడం లేదు. ఇదిలావుండగా టీడీపీ ప్రభుత్వ హయాంలో మిగిలినచోట్ల నిర్మించిన ఇళ్లను 2018లో లబ్ధిదారులకు కేటాయించారు. కొమ్మాది, పరదేశిపాలెంలో 804 ఇళ్లకు కూడా లబ్ధిదారులను ఎంపిక చేశారు. అయితే అక్కడ కనీస సదుపాయాలు లేకపోవడంతో ఎవరూ నివాసం ఉండడం లేదు. ఇళ్ల నిర్మాణం ఎప్పుడు పూర్తిచేస్తారా... అని గడచిన ఐదారేళ్ల నుంచి లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

ఏయూ దూర విద్యలో లేటరల్ ఎంట్రీ దుమారం

... 5వ పేజీ తరువాయి

అడ్మిషన్లకు ముందుగా నోటిఫికేషన్ ఇస్తారు. లేటరల్ ఎంట్రీలకు కూడా ఇది అవసరం. కానీ ప్రస్తుతం నోటిఫికేషన్ ఇవ్వకుండానే ప్రవేశాల ప్రక్రియను ప్రారంభించినట్టు తెలుస్తోంది. దీనిపై దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ్‌మోహన్‌ను వివరణ కోరగా విద్యార్థులకు మేలు చేకూరుతుందన్న ఉద్దేశంతోనే లేటరల్ ఎంట్రీ విధానంలో ప్రవేశాలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. ఏయూ పరిధిలోని విద్యార్థులకు మాత్రమే ఈ అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు అనేక కారణాలతో వందలాది మంది డిగ్రీలను మధ్యలోనే వదిలేశారని, వారికి మేలు చేయడమే ధ్యేయమని, ఉన్నతాధికారుల అనుమతితోనే ప్రక్రియను ప్రారంభించామన్నారు.

స్టీల్‌ప్లాంటులో విభిన్న పరిస్థితులు!

» సమస్యలను పరిష్కరించాలంటూ ఆందోళనలు చేస్తున్న అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు



ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారంలో విభిన్న పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని వర్గాల ఉద్యోగులు ఆందోళన బాట పడుతున్నారు. అధికారులు, ఉద్యోగులు (నాన్-ఎగ్జిక్యూటివ్), కాంట్రాక్టు కార్మికులు ఎవరికి వారే తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఆందోళనలకు దిగుతున్నారు. ఒకపక్క స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమం జరుగుతుండగా, మరోపక్క ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఆందోళన చేస్తున్నారు. వేతన సవరణ, పీఆర్సీ, పదోన్నతులు, పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా వేతనాల కోసం ఉద్యోగులు గత కొన్ని నెలలుగా ఉద్యమాలు చేస్తున్నారు.

సకాలంలో వేతనాలు చెల్లించాలని, విభాగాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు, ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు, ఈఎస్‌ఐ, పీఎఫ్, ఫైనల్, జీతాలను సకాలంలో ఇవ్వాలని కాంట్రాక్టు కార్మికులు ఆందోళన బాట పట్టారు.

సమస్యల పరిష్కారంపై ఉక్కు యాజమాన్యం దృష్టి సారించాలి

-పీవీ రమణమూర్తి, ఇంటక్ అధ్యక్షుడు



అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించడానికి స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ముందుకు రావాలి. ఉక్కు మంత్రిత్వశాఖ, యాజమాన్యం తగిన చర్యలు చేపట్టి ప్లాంటును ప్రగతి పథంలో పయనించేలా ముందుకు తీసుకువెళ్లాలి. మంచి వాతావరణంలో ప్లాంట్ ఉత్పత్తిని మరింత పెంచేందుకు యాజమాన్యం అందుకు తగ్గ వనరులు సమకూర్చాలి.

కుక్కల దాడిలో జింకకు గాయాలు

» ఈ నెలలో ఇది మూడో ఘటన



కుక్కల దాడిలో గాయపడిన జింక

విశాఖపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యంగా కారణంగా కుక్కల దాడిలో ఒక జింక గాయపడింది. ఆదివారం మధ్యాహ్నం ఎండాడలో గల కేవీఆర్ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లోకి ఒక జింక వచ్చింది. దానిని చూసిన కుక్కలు దాడి చేశాయి. స్థానికులు గమనించి వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ శాఖ రేంజర్ శాస్త్రి, డీఆర్వో కోటేశ్వరారవు, అసిస్టెంట్ బీట్ అధికారి భాను వచ్చి పరిశీలించారు. వెంటనే జింకకు జూలోని పశు వైద్యులతో చికిత్స చేయించారు. కాగా జూలోని జింకలు తరచూ రోడ్డు పైకి రావడంతో కుక్కల దాడికి గురవుతున్నాయి. ఈ నెలలో ఇలాంటి సంఘటన ఇది మూడోది కావడం గమనార్హం. జింకలు బయటకు రాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని జంతు ప్రేమికులు, స్థానికులు కోరుతున్నారు. కంబాలకొండ క్రాస్ వద్ద జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ప్రాంతాల్లో ఎత్తైన ప్రహరీలు నిర్మించాలని కోరుతున్నారు.

భద్రతపై అవగాహన ఉండాలి

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): భద్రతతోనే ప్రమాదాలు జరగవని, అందువల్ల భద్రతపై అందరూ అవగాహన కలిగి ఉండాలని స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) రంజన్ మహంతి అన్నారు. జాతీయ భద్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉక్కు క్లబ్‌లో ఆదివారం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతమైన పౌరులుగా ప్రతి విద్యార్థి ఉండాలన్నారు. కార్యక్రమంలో సీజీఎం (సేఫ్టీ) ప్రవీణ్‌కుమార్, జీఎంలు యుఎస్ బెహరా, రాజు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌వోడీకి అభినందనలు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్‌డీ, ట్రైనింగ్ సెంటర్ హెచ్‌వోడీగా బాధ్యతలు స్వీకరించిన పీకేఎస్ ఆర్ ఠాగూర్‌ను ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌వోడీ మాట్లాడుతూ ఉద్యోగులకు, విద్యార్థులకు శిక్షణ ఇచ్చే విషయంలో ట్రైనింగ్ సెంటర్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. విభాగం ప్రగతికి మరింత కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు బొండా తౌడన్న, బయ్యే మల్లయ్య, ఎస్.సత్యనారాయణ, కేవీ రత్నం, పుల్లారావు, ఫణీంద్ర బాబు, సాయిప్రసాద్, టిర్కి పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **లైలా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం),
- **తండేల్:** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
- **మదగజరాజ:** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం),
- **సంక్రాంతికి వస్తున్నాం:** శారద, మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్:** శరత్, శ్రీకన్య, కిన్నెర, సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 10, వంకాయలు (తెలుపు) 16, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 36, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 46, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 12, క్యారెట్ 26 దొండకాయలు 28, బంగాళ దుంపలు 15, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది)40, బరబాటి 30, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 70, బద్దచిక్కుడు 26, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 130, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 40, కీర దోస 26, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 32 చిలగడదుంపలు 38, కంద 68, దేముడు చిక్కుడు 28, గోరు చిక్కుడు 28, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 25, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, క్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	90
లైవ్ ధర	100
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200



సాయినాథుని ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు. (ఇన్‌సెట్లో) బాబా విగ్రహం



సోమవారం చేపట్టనున్న అభిషేకాల కోసం సిద్ధం చేసిన కలశాలు

వైభవంగా షిర్డీ సాయినాథుని ఆలయ వార్షికోత్సవాలు

శాతవాహన నగర్‌లో నేటితో ముగింపు

సాయిబాబాకు ప్రత్యేక కలశాభిషేకాలు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86వ వార్డు పరిధి శాతవాహన నగర్‌లో షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇక్కడి సాయినాథున్ని దర్శించుకుంటే షిర్డీలో బాబాను చూసినంత సంతృప్తి కలుగుతుందన్నది భక్తుల భావన. అందుకే స్థానికులతో పాటు పారిశ్రామిక ప్రాంత ప్రజలు, నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఈ ఆలయానికి వస్తుంటారు. ఇక్కడి సాయినాథుని మందిరాన్ని దత్తసాయి మందిర కమిటీ ఇరవై ఏళ్ల క్రితం నిర్మించింది. షిర్డీలో మాదిరిగానే రోజూ ఇక్కడ పూజాది నిర్వహిస్తుండడం విశేషం.

నేడు ప్రత్యేక కలాశాభిషేకాలు

పూజాది కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం దత్త సాయినాథునికి పంచామృత, ఫలోదక, సుగంధ, సువర్ణ, హిరణ్య, రజిత, పుష్ప, భస్మ, చందన, నవరత్న సహిత ఏకాదశి కలశాభిషేకాలను ప్రధాన అర్చకులు వెంకట శ్రీధర్ స్వామి బృందం ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. సాయంత్రం మేళతాళాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ సాయిబాబు ఉత్సవ విగ్రహాన్ని పాత కూర్మన్నపాలెం, శాతవాహన నగర్, శ్రీకృష్ణా నగర్, ముస్తఫా సెంటర్, దువ్వాడ స్టేషన్ రోడ్లలో ఊరేగించనున్నారు.

ఉత్సవాల ముగింపు రోజైన ఆదివారం ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మందిర కమిటీ ప్రతినిధులు తగిన ఏర్పాట్లు చేశారు. అలాగే మహా అన్న సమారాధనను చేపట్టనున్నట్టు వారు తెలిపారు.

మల్కాపురం పోలీస్ స్టేషన్ నుంచి ఇద్దరు గంజాయి నిందితుల పరారీ

» బేడీలను తొలగించుకుని కిటికీలో నుంచి దూకి పారిపోయిన వైనం

» తీవ్రంగా గాలిస్తున్న పోలీసులు

మల్కాపురం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గంజాయితో పట్టుబడిన ఇద్దరు నిందితులు మల్కాపురం పోలీస్ స్టేషన్ నుంచి తప్పించుకోవడం కలకలం రేపింది. ఇద్దరు నిందితుల చేతులకు బేడీలు వేసినప్పటికీ వాటిని ఎంతో చాకచాక్యంగా తొలగించుకుని వారు కిటికీలో నుంచి దూకి పారిపోయారు. ఈ దృశ్యాలన్నీ స్టేషన్‌లోని సీసీ కెమెరాలో నమోదయ్యాయి. అనకాపల్లి జిల్లా కశింకోట ప్రాంతానికి చెందిన కొరిబిల్లి ప్రసాద్ (22), కిల్లి ప్రసాద్ (24)లు శనివారం మధ్యాహ్నం మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గల హెచ్‌పీ పెట్రో పార్కు సమీపంలో రెండు కిలోల గంజాయితో ఉన్నట్టు అందిన సమాచారం మేరకు నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని మల్కాపురం పోలీసులకు అప్పగించారు. వారిని పోలీసులు విచారించగా.. కశింకోటకు చెందిన ఓ వ్యక్తి తమకు గంజాయి ఇచ్చినట్టు చెప్పడంతో మల్కాపురం సీఐ విద్యాసాగర్ నిందితులు చెప్పిన చిరునామాకు వెళ్లారు.

ఈలోగా మల్కాపురం పోలీస్ స్టేషన్‌కు గొడవ పడుతూ తల్లి, కూతురు వారిని వారించడానికి పోలీసులు బయటకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన నిందితులు బేడీలను తొలగించుకుని కంప్యూటర్ రూమ్‌లో ఉన్న కిటికీలో నుంచి బయటకు దూకి పోలీసుల పాత క్వార్టర్స్ నుంచి ఏకేసీ కాలనీ మీదుగా పారిపోయారు. కాగా తల్లీకూతుళ్ల గొడవ సద్దుమణుగయ్యాక పోలీసులు వచ్చి చూసేసరికి నిందితులు కనిపించలేదు. తప్పించుకున్న నిందితుల కోసం తీవ్రంగా గాలిస్తున్నామని సీఐ విద్యాసాగర్ తెలిపారు. కాగా నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు వారికి గంజాయి ఇచ్చిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ సంఘటన తరువాత స్టేషన్‌లోని కిటికీలను మార్పు చేసే పనిని పోలీసులు చేపట్టారు. సీఐ విద్యాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ హయాంలో నాలా కుంభకోణం

జిల్లాలో రూ.700 కోట్ల బకాయిలు

జనసేన పార్టీ కార్పొరేటర్ మూర్తి యాదవ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో పెద్దఎత్తున నాలా పన్ను కుంభకోణం జరిగిందని జనసేన కార్పొరేటర్ పీతలమూర్తియాదవ్ ఆరోపించారు. హోటల్ మేఘాలయలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో నాన్ అగ్రికల్చరల్ లాండ్ అసెస్‌మెంట్ (నాలా) బకాయిలు రూ.700 కోట్లు ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలైనా కొంతమంది అధికారులకు వైసీపీ వాసనలు పోలేదన్నారు. విశాఖ రెవెన్యూ డివిజన్ పరిధిలో సుమారు రూ.వంద కోట్లు బకాయిలుండగా గాజువాక పరిధిలోనే రూ.64 కోట్లు ఉన్నాయన్నారు. పెందుర్తి మండలం పరిధిలో 43.77 కోట్లు, భీమిలి రెవెన్యూ డివిజన్ పరిధిలో రూ.88.71 కోట్లు, విశాఖ రూరల్ పరిధిలో రూ.307.47 కోట్లు, భీమిలి మండల పరిధిలో రూ.204 కోట్లు బకాయిలున్నాయన్నారు. ఎవరైనా అగ్రికల్చర్ లాండ్‌లో లేఅవుట్ వేయాలంటే నాలా కట్టిన తర్వాతే వీఎంఆర్‌డీఏ అనుమతి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. జీవీఎంసీ పరిధిలోనాలా కట్టిన తర్వాత భవన నిర్మాణానికి అనుమతులు, నిర్మాణం పూర్తైన తర్వాత ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీచేయాలన్నారు. కొంతమంది రెవెన్యూ, జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులకు ముడుపులు చెల్లించి నాలా ఎగ్గొడుతున్నారన్నారు. దీనిపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టిసారించాలన్నారు.



మాట్లాడుతున్న మూర్తి యాదవ్

కొట్లాటకు దిగిన ఇంజనీరింగ్ విద్యార్థులు

కేసు నమోదు చేసిన దువ్వాడ పోలీసులు



గొడవ పడుతున్న విద్యార్థులు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా గల ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సాయంత్రం విద్యార్థులు కొట్లాటకు దిగడంతో దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కళాశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు డ్యాన్స్‌లు చేశారు. ఆ సమయంలో డ్యాన్స్ చేస్తున్న ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సర విద్యార్థి ప్రదీప్ కాలు పొరపాటున తృతీయ సంవత్సర విద్యార్థి సూర్యాకు తగిలింది. దీంతో ఆగ్రహానికి గురైన సూర్యాతో పాటు చరణ్, చంద్రమౌళి, ఇతర స్నేహితులు సీనియర్స్‌ను అగౌరవపరుస్తారా అంటూ ప్రదీప్‌ను తీవ్రంగా కొట్టారు. దీంతో ప్రదీప్ స్నేహితుడు కె.ఈశ్వర్ అడ్డుకోవడంతో అతన్ని కూడా కొట్టారు. గాయపడిన ప్రదీప్, ఈశ్వర్‌లను వారి మిత్రులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈశ్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కొట్లాటలో ఎంతమంది పాల్గొన్నారో తదితర వివరాలను సేకరిస్తున్నామని పోలీసులు తెలిపారు.

అతిగా మద్యం తాగి డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి



శ్రీనివాస్ మృతదేహం

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం సేవించి డ్రైనేజీలో పడడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 88వ వార్డు పరిధి మంగళపాలెంలో మార్గాన శ్రీనివాస్ (45) భార్య శాంతి, ఇతర కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. స్థానికంగా గల ఓ ప్రైవేటు కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న శ్రీనివాస్‌కు రెండు రోజులు క్రితం జీతం రావడంతో అతిగా మద్యం సేవించసాగాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం పూటుగా మద్యం సేవించి ఇంటికి సమీపంలో గల డ్రైనేజీ గోడపై కూర్చున్నాడు. ఇంట్లోకి రమ్మని కుటుంబ సభ్యులు పిలిచినా రాలేదు. కాగా ఆదివారం ఉదయం స్థానికులు చెత్త పారేయడానికి డ్రైనేజీ వద్దకు వచ్చేసరికి శ్రీనివాస్ అందులో పడి మృతి చెంది ఉన్నట్టు గుర్తించారు. సమాచారం అందుకున్న దువ్వాడ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. శ్రీనివాస్ భార్య శాంతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శఠగోపాలను అందజేస్తున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధులు

సింహాద్రి అప్పన్నకు రూ.10 లక్షల విలువైన బంగారు పూత శఠగోపాలు బహూకరణ

సింహాచలం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామికి హరేకృష్ణ మువ్‌మెంటు గ్లోబల్ ఛైర్మన్ పద్మశ్రీ మధు పండితదాస సుమారు రూ.10 లక్షలు విలువైన బంగారు పూతతో రెండు శఠగోపురాలను కానుకగా బహూకరించారు. హరేకృష్ణ మువ్‌మెంటు విశాఖ శాఖ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస, ఇతర ప్రతినిధులతో కలిసి ఆదివారం ఆలయ ఏఈవో నక్కాన ఆనందకుమార్‌కు అందజేశారు. తొలుత అంతరాలయంలో స్వామి మూలవిరాట్ సన్నిధిలో కానుకలను ఉంచి లోక కల్యాణార్థం అనే సంకల్పంతో ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు పూజలు చేశారు. ఈ సందర్భంగా మధుదాస మాట్లాడుతూ 52 ఏళ్ల క్రితం హరేకృష్ణ మువ్‌మెంటుకు చెందిన ప్రభుపాదుల వారు అప్పన్నను తొలిసారి దర్శించుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని 540 గ్రాముల స్వర్ణమాలాము చేసిన శఠగోపురాలను అప్పన్న సేవలకు అందజేసినట్టు చెప్పారు.

రైతుబజార్లలో నేరుగా కూరగాయల అమ్మకం

విశాఖపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రైతులు తాము పండించిన కూరగాయలను నేరుగా రైతుబజార్లలో విక్రయించుకోవచ్చునని సహాయ మార్కెటింగ్ సంచాలకులు, జాయింట్ కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఎక్కువ మొత్తంలో కూరగాయల దిగుబడి వస్తున్నదని, వాటికి తమ ప్రాంతంలో తగిన ధర రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో మార్కెటింగ్ శాఖ ద్వారా రైతుబజార్లలో ఆరోజుధరకు అమ్ముకోవచ్చునన్నారు. ఈ విషయంలో ఇబ్బందులు ఎదరైతే అందుబాటులో ఉన్న ఉద్యానవనశాఖ అధికారులు, మార్కెటింగ్ కమిటీ కార్యదర్శులకు ఫిర్యాదు చేయాలన్నారు సందేహాలుంటే 9959592474 నంబరులో సంప్రతించాలన్నారు.

యువత అన్ని రంగాలలో రాణించాలి

మల్కాపురం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): యువత చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలని రీసోర్స్ పర్సన్ సిస్టర్ హిల్డా అన్నారు. స్థానిక నవజ్యోతి మ్యాక్స్ సొసైటీలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఏ రంగంలోనైనా కష్టపడితే లక్ష్యాలను సాధించవచ్చున్నారు. ప్రస్తుతం యువత మానసికంగా కృంగిపోతున్నారని, దీనికి కారణం నిరుద్యోగం, ప్రేమ వ్యవహారాలు, ఆర్థిక, కుటుంబ సమస్యలు, చెడు సావాసాలు వంటివేనన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ సిస్టర్ సంగీత, ప్రతినిధులు వెంకటలక్ష్మి, విజయ, హేమ, తదితరులు పాల్గొన్నారు.



బెలూన్లు ఎగురవేసి శారీ వాక్ ప్రారంభిస్తున్న సినీ నటి గౌతమి, మేయర్ హరివెంకటకుమారి, తదితరులు

క్యాన్సర్ రహిత సమాజమే ధ్యేయం

సినీ నటి, లైఫ్ అగైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు గౌతమి

బీచ్‌రోడ్డులో సందడిగా పింక్ సఖీ శారీ వాక్ ర్యాలీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): భయాన్ని వీడి పోరాడితే క్యాన్సర్‌ను అధిగమించవచ్చని, క్యాన్సర్ రహిత సమాజం కోసం కృషి చేయాలని సినీ నటి, లైఫ్ అగైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు గౌతమి పేర్కొన్నారు. రౌండ్ టేబుల్ లేడీస్ సర్కిల్ ఆఫ్ ఇండియా, రోహిత్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం బీచ్ రోడ్డులో నిర్వహించిన పింక్ సఖీ శారీ వాక్‌లో ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ వస్తే అధైర్యపడవద్దన్నారు. ఈ వ్యాధిపై అపోహలున్నాయని, అవగాహన పెంచుకుని, భయాన్ని దూరం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తూ సాగాలన్నారు. ధైర్యంగా ఉంటే జీవితాల్లో కొత్త వెలుగులు నింపుకోవచ్చన్నారు. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి మాట్లాడుతూ మహిళలకు ఇటీవల బ్రెస్ట్ క్యాన్సర్ ఎక్కువగా వస్తోందని, భయంతో కుంగిపోకుండా ధైర్యంగా పోరాడితే వ్యాధిని దూరం చేసుకోవచ్చన్నారు. 40 సంవత్సరాలు దాటిన మహిళలంతా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న వారికి ధైర్యం ఇవ్వాలని, వారిని ప్రేమగా పలకరించాలన్నారు. కార్యక్రమానికి శిల్పా చక్రవర్తి వ్యాఖ్యాతగా వ్యవహరించగా, గురుద్వార్ సత్సంగ్ అధ్యక్షుడు పీఎస్ ఆనంద్, ఏజ్ కేర్ ఫౌండేషన్ ప్రతినిధి ఎన్ఎస్ రాజు, రవీంద, వరుణ్ గ్రూప్ సంస్థల ఛైర్మన్ ఎస్సీ ప్రభు కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్తలకు పంచకర్ల అభినందనలు



పంచకర్లను సత్కరించి చిత్రపటాన్ని అందజేస్తున్న కార్యకర్తలు

పెందుర్తి ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో జనసేన పార్టీ సభ్యత్వాలను 26 వేలు చేపట్టి రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో 'పెందుర్తి'ని నిలిపినందుకు గాను ఆదివారం సుజాతనగర్‌లో కార్యకర్తల అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు హాజరై అధిక సభ్యత్వాలు చేసిన క్రియాశీలక కార్యకర్తలను సత్కరించి అభినందించారు. అనంతరం పంచకర్లను కార్యకర్తలు సన్మానించారు.

జనసేన పార్టీలో పలువురు చేరిక

సింధియా: జీవీఎంసీ 63వ వార్డుకు చెందిన పలువురు స్థానికులు ఆదివారం జనసేనలో చేరారు. పార్టీ వార్డు అధ్యక్షుడు శివ గొరిపూటి ఆధ్వర్యంలో వారు జనసేనలో చేరారు. వారిని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి అంగ దుర్గాప్రశాంతి పార్టీలోకి ఆహ్వానించారు.

ఘనంగా వెంకాయమ్మ పరస



పరసలో పాల్గొన్న ప్రజలు

పెదగంట్యాడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడలో దివంగత గంట్యాడ వెంకాయమ్మ వర్ధంతి పేరిట ఆదివారం ఘనంగా పరస నిర్వహించారు. వెంకాయమ్మ కుమారుడు గోవిందరాజు ప్రతి ఏటా మాదిరిగా ఈసారి కూడా వైభవంగా పరసను చేపట్టారు. సాయంత్రం నాలుగు నుంచి రాత్రి పది గంటల వరకు ఫైర్ స్టేషన్ జంక్షన్ నుంచి పెదగంట్యాడ జంక్షన్ కూడలి, నెల్లిముక్కు జంక్షన్ వరకు సందడి వాతావరణ నెలకొంది. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. చిన్నారులను అలరించేలా అనేక షాపులు, జెయింట్ వీల్, స్కిప్పింగ్ స్టేజ్ వంటి వాటిని ఏర్పాటు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.

రజకుల బల్లల పండగ

ఎన్.ఎ.డి.జంక్షన్: జీవీఎంసీ 52వ వార్డు పరిధి మర్రిపాలెం వుడా కాలనీలో తలుపులమ్మ తల్లి రజక సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బల్లల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ పండగను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. బల్లల పండగలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఆయనను సంఘం సభ్యులు సత్కరించారు.

ఆర్యవైశ్యుల జిల్లా నూతన కార్యవర్గం

గాజువాక, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా ఆర్యవైశ్యుల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం గాజువాకలోని గుండా గురుమూర్తి కల్యాణ మండపంలో జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా బెల్లాల పెంటబాబు, కార్యదర్శిగా గునిశెట్టి అప్పలసత్యనారాయణ గుప్తా, కోశాధికారిగా కట్టా సత్యానందం, యువజన సంఘం అధ్యక్షుడిగా కందుల సాయి సత్యనారాయణ, కార్యదర్శిగా రెంటాల సుధాకర్, కోశాధికారిగా కె.గుప్తాలతో పాటు పలువురు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ, కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి బంగారు చైన్ బహూకరణ

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేంకటేశ్వరస్వామికి ఆలయ వేదపండితులు ప్రత్యేక పూలతో అభిషేకించాక పూజలు జరిపారు. ఈ సందర్భంగా శ్రీవారికి నరవ ప్రాంతానికి చెందిన భక్తులు నంబాల ఆచార్యులు, స్వాతి, సౌమ్యలు సుమారు రూ.లక్షా 20 వేల విలువ చేసే బంగారు చైన్‌ను పాలక మండలి సభ్యులు, ఆలయ పండితులకు అందజేశారు.

మద్యం మత్తులో వ్యక్తిపై దాడి

రూ.5 వేలు లాక్కుని పారిపోయిన నలుగురు యువకులు

పెందుర్తి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వేపగుంట సమీపంలోని నాయుడుతోట వద్ద ఓ వ్యక్తిపై నలుగురు యువకులు దాడి చేసి కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పెందుర్తి క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వడ్లపూడికి చెందిన సాయికిరణ్ (46) అనే రైల్వే ఉద్యోగికి నాయుడుతోట వద్ద సొంతిల్లు ఉంది. ఆ ఇంటిని చూసుకునేందుకు ఆదివారం సాయంత్రం ఆయన ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా విరాట్‌నగర్‌లో ఉంటున్న ప్రసాద్ అనే స్నేహితుడితో కలిసి బార్‌లో సాయికిరణ్ మద్యం సేవించారు. అనంతరం సాయికిరణ్ వడ్లపూడి వెళ్లేందుకు క్యాబ్ బుక్ చేసుకుని నాయుడుతోట బస్టాప్ వద్ద వేచివున్నారు. ఆ సమయంలో బస్టాప్ వద్ద మద్యం సేవించి ఉన్న నలుగురు యువకులు ఉన్నారు. సాయికిరణ్‌కు వారితో ఏదో విషయంలో గొడవ జరిగింది. దీంతో ఆ నలుగురు యువకులు సాయికిరణ్‌ను చితకబాది ఆయన వద్దనున్న రూ.ఐదు వేలను లాక్కుని పారిపోయారు. తీవ్రంగా గాయపడిన సాయికిరణ్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించగా వైద్యులు నాలుగు కుట్లు వేశారు. అనంతరం సాయికిరణ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.